భవిష్యత్ ప్రజాపాలన
మా వార్త రేపటి భవిష్యత్తుకు నిదర్శనం
తెలుగు దినపత్రిక
bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in
ASN NEWS
ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి తెలంగాణ - రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 203 శుక్రవారం , ఆగస్టు 21, 2026 , పేజీలు - 12 వెల : 1 /-

## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

**- హజరైన ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు**




**మహాబలిపురం,ఆగస్టు 20 :** హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం మహాబలిపురంలో జరిగింది. ఈ సమావేశంకు ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు మిగతా2లో...

## సమస్యల పరిష్కారమే అసలైన
# సమాఖ్యవాదం

● దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు ● కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు చేయూత ● పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మహాబలిపురం,ఆగస్టు 20 :** కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్ మిగతా2లో...



## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

- నిషేధిత జాబితాకు పొంగులేటిదే బాధ్యత
- బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 :** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. మిగతా2లో...

### రాజీవ్ జయంతి సందర్భంగా
## కాంగ్రెస్ నివాళి

వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం

ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోడీ


2లో

## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా కార్యక్రమం

కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయాను మంత్రి వాకిటి శ్రీహరి ఆహ్వానం


2లో

### 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు
# పరిష్కారం..

కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు

అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



**హైదరాబాద్,ఆగస్టు 20 :** 22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి గారు స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, మిగతా2లో...



## పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

నైపుణ్య శిక్షణ అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్,ఆగస్టు 20 :** ఇటీవల స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్‌ల విలీనంపై నెలకొన్న అపోహలకు మంత్రి వివేక్ వెంకటస్వామి తెరదించారు. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనంపై కొందరు అపోహలు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. పాలిటెక్నిక్‌లను మరింత అప్‌గ్రేడ్ చేసి, విద్యార్థులకు మెరుగైన నైపుణ్య శిక్షణ అందించాలనే ఉద్దేశంతోనే వాటిని స్కిల్ యూనివర్సిటీ మిగతా2లో...

## అర్ధరాత్రి బావిలోకి
# దూసుకెళ్లిన కారు

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**



**సిద్దిపేట,ఆగస్టు 20 :** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈవిషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

### తెలంగాణలో 22ఎ సెక్షన్
# దుర్వినియోగం

రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ




**హైదరాబాద్,ఆగస్టు 20 :** తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఊఓఆం అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ం జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల దందా సాగుతుంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30? కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. మిగతా2లో...

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

అందుకు తనను బాధ్యులు చేయడం తగదు

క్రమశిక్షణ లేఖను ఉపసంహరించుకోవాలన్న కొండా సురేఖ


2లో

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు.సమస్యలు రాష్ట్ర సరిహద్దులను ప్రభుత్వ ÷ళ్లె కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్?ఎఎ పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన పక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందని అన్నారు. షెడ్యూల్ లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం?2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్?చీ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధ్రప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేవని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన పక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు.

## 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

(మొదటి పేజీ తరువాయి)

వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ÷ాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమ వుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి‘ అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. ధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు.

## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 :** తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ / ఎండీ సోనిబాలాదేవి న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తెలంగాణను దేశ క్రీడా పటంలో మరింత బలమైన రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ల్గ÷లో ఇండియా కార్యక్రమ నిర్వహణ కోసం తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

22ంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు.

సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

**హైదరాబాద్,ఆగస్టు 20 :** తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణా కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరింది. అలాగే క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందించారు. దీనిపై మంత్రి కొండా సురేఖను వివరణ కోరతామని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.

## రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 :** భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది.ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యు వతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయా లు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ( సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదించిన చేసారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరిన ముఖ్యమంత్రి దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్నారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్న సీఎం, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. కావేరి నదుల అనుసంధా నంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదన చేసిన సీఎం, గోదావరి, కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గంగా, కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరం అన్న చంద్రబాబు, నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలన్నా రు. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని కొనియాడిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్ తో మాట్లాడారని పేర్కొన్నారు. విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారని ప్రశంసించారు కర్ణాటక సీఎం డీకే శివకుమార్.

## పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. బ్లూ కాలర్ ఉద్యోగాల్లోనూ తెలంగాణ యువత ముందుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్లు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతారని, వారి సర్వీసు భద్రతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. డిప్యూటేషన్, బదిలీల విధానంలోనూ ఎలాంటి మార్పులు ఉండవని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసినప్పటికీ పాలిటెక్నిక్ ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, విద్యార్థులు ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే విధానం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే పాలిసెట్‌ను కూడా కొనసాగిస్తామని తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థు లు, లెక్చరర్లకు విలీనంతో మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థులకు రూ.2 వేల స్టైఫండ్ అందించే అంశంపై కూడా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. వరంగల్‌లో విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకుని బదిలీ చేశామని తెలిపారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలిటెక్నిక్ కాలేజీలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనల వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని ఆరోపించిన మంత్రి.. రాజకీయ పార్టీల తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు, ఉద్యోగులు నమ్మవద్దని సూచించారు. శక్తి శాఖ పేరును కార్మిక శాఖగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు వస్తున్నాయని, శాఖ పేరులో 'కార్మిక' పదం కూడా ఉండేలా మార్పులు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు.

## భద్రాచలం ఐదు గ్రామాలు తెలంగాణలో కలపాలి: మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఆగస్టు 20 :**రాష్ట్ర విభజన అనంతరం పెండింగ్‌లో ఉన్న తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలను కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నించింది.

గురువారం మహాబలిపురంలో కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాలుగు ప్రధాన అంశాలపై కేంద్రం, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని, పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు ఏపి వాటా నిధులు విడుదల చేయాలని, ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని, భద్రాచలం, ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రాన్ని కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలం పరిసరాల్లోని యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని తుమ్మల కోరారు.

ఈ ఐదు పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా, వాటి మొత్తం భౌగోళిక విస్తీర్ణం 11,122.01 ఎకరాలు అన్నారు. 2024 జూలై 18న భారీ వర్షాలకు దెబ్బతిన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెద్దవాగు ప్రాజెక్టును శాశ్వతంగా పునరుద్ధరించేందుకు రూ.92.20 కోట్లు అవసరమని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 16 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, మొత్తం ఆయకట్టులో 85.25 శాతం(13,640 ఎకరాలు) ఏపి పరిధిలోనే ఉందన్నారు.శాశ్వత పునరుద్ధరణ వ్యయాన్ని ఆయకట్టు నిష్పత్తి ప్రకారం రెండు రాష్ట్రాలు భరించాలని, ఏపీ తన వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని చంద్రబాబును కోరారు. గత ఫిబ్రవరిలోనే విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్ణయం పెండింగ్‌లో ఉందని, రైతుల ప్రయోజనాల

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించి ముందుగా విలీనం తేదీ ప్రకటించాలి

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 20:** విలీనం జరిగే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం: బహుజన వర్కర్స్ యూనియన్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఆర్టీసీ కార్మికుల భవిష్యత్తుపై తీవ్రఆందోళన కలిగిస్తున్నాయి.ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యం లేబర్ కమిషనర్ వ్యవహరిస్తున్న తీరుతో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఆ సమస్య లను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు





బహుజన వర్కర్స్ యూనియన్ ముందుకు వస్తోందని రాష్ట్ర అధ్యక్షులు సాజిద్ మహమ్మద్ తెలిపారు. ఒకవైపు ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులు,ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల నియామకాలు కొనసాగుతుండగా, మరోవైపు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పోరాడిన ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి నెల ఉద్యోగ విరమణ చేస్తున్న కార్మికులకు రావాల్సిన బకాయిలు సకాలంలో అందకపోవడం, ఉద్యోగంలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం ఆందోళనకరమైన పరిస్థితికి దారితీస్తోంది. ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో, ఏప్రిల్ 24న మంత్రుల కమిటీ, ఐఏఎస్ కమిటీ, ఆర్టీసీ యాజమాన్యం మధ్య చర్చలు జరిగాయి. అనంతరం మే లేదా జూన్‌లో యూనియన్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని చెప్పినప్పటికీ, ఆగస్టు 16వ తేదీ నాటికీ ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో కార్మికుల్లో మరింత అయోమయం నెలకొంది. ఆర్టీసీ కార్మికుల ప్రధాన ఆకాంక్ష ప్రభుత్వంలో విలీనం కావడం. అదే సమయంలో రిటైర్డ్ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. ఈ సమస్యలన్నింటిపై బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించి,కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది. ముందుగా ఆర్టీసీ విలీనం తేదీని ప్రభుత్వం ప్రకటించి, అనంతరం యూనియన్ ఎన్నికల ప్రక్రియను చేపట్టాలని బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోంది. మెజారిటీ ఆర్టీసీ కార్మికుల ఆకాంక్షను ప్రభుత్వం, యాజమాన్యం లేబర్ కమిషనర్ గౌరవించాలని కోరుతున్నాము. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యేంతవరకు బహుజన వర్కర్స్ యూనియన్ పోరాటం కొనసాగిస్తుంది. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. కార్మికుల సమస్యలను పరిష్కరించి, ఆర్టీసీ భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బహుజన వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి చేస్తోంది.ఈ కార్యక్రమంలో బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాజిద్ మహమ్మద్
రాష్ట్ర అధ్యక్షులు
బహుజన వర్కర్స్ యూనియన్
సుద్దాల సురేష్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
బహుజన వర్కర్స్ యూనియన్

# హైదరాబాద్‌కు చెందిన మరో వర్ధమాన క్రికెట్ స్టార్ హుస్సేన్ సయీద్

● **బీ-లీగ్ మ్యాచ్‌లో ఐదు ఓవర్లలో ఏడు పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు తీసి రికార్డు సృష్టించాడు**

**హైదరాబాద్ ఆగస్టు 19:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బి లీగ్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో రైజింగ్ స్టార్ యువ ఆటగాడు ఎస్ఎం హుస్సేన్ సయీద్ అద్భుత, విధ్వంసక ప్రదర్శనతో కేవలం ఏడు ఓవర్లలో ఐదు వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించాడు. నిన్న జుజ×ూ గ్రౌండ్స్‌లో స్పోర్టివ్ కోసం ఆడుతున్న హుస్సేన్ రెండు రోజుల మ్యాచ్‌లో కేవలం 26.2 ఓవర్లలో 80 పరుగులు చేసి టోర్నమెంట్ నుండి ప్రత్యర్థి జట్టు అవర్స్‌ను పడగొట్టడంలో కీలక పాత్ర పోషించాడు. తొలి రోజు స్పోర్టివ్స్ జట్టు 84 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. రెండవ రోజు, లంచ్‌కు ముందు కేవలం 26.2 ఓవర్లలో 80 ఓవర్ల స్వల్ప స్కోరు వద్ద ప్రత్యర్థి మార్స్‌ను అవుట్ చేయడం ద్వారా



స్పోర్టివ్ తదుపరి దశకు అర్హత సాధించింది. ఈ విజయంలో రావీ హుస్సేన్ సయీద్ చాలా ముఖ్యమైన పాత్ర పోషించారు. యువ అప్ అండ్ కమర్ వేగంగా బౌలింగ్ చేస్తూ ఏడు ఓవర్లలో ఐదు వికెట్లు పడగొట్టాడు. అతని ఐదు ఓవర్లు మెయిడిన్లు కావడంతో ప్రత్యర్థి జట్టు ఎలాంటి పరుగులు చేయలేకపోయింది. హుస్సేన్ సయీద్ ఏడు పరుగులు మాత్రమే ఇచ్చాడు. మ్యాచ్ రెండో ఓవర్‌లో, అతను మొదటి బంతిని బౌల్ చేసినప్పుడు, మా జట్టులోని కౌశిక్ దానిపై అద్భుతమైన ఫోర్ కొట్టాడు, అయితే ఆ తర్వాత హుస్సేన్ ప్రత్యర్థి జట్టుకు మరో మూడు పరుగులు చేసే అవకాశం ఇవ్వలేదు మరియు ఒకదాని తర్వాత ఒకటి వరుసగా ఐదు వికెట్లు పడగొట్టాడు. అతను ప్రత్యర్థి జట్టు యొక్క బ్యాటింగ్ లైన్‌ను నాశనం చేశాడు మరియు వారిని తక్కువ స్కోరుకే అవుట్ చేయడంలో సహాయం చేశాడు. లీగ్ స్థానం: ఎజూా యొక్క ప్రస్తుత రౌండ్లలో అతను అత్యుత్తమ బౌలింగ్ స్పెల్‌లలో ఒకటిగా పరిగణించబడ్డాడు. ఒకే మ్యాచ్ యొక్క రెగ్యులర్ చార్ట్‌లో 7 ఓవర్లు, 5 మెయిడిన్లు మరియు 5 వికెట్ల ప్రత్యేక రికార్డు నమోదు కాలేదు.

# సాగునీరు విడుదల మూడు రోజుల ముచ్చటే!



**దేవరుప్పుల, ఆగస్టు 20 (భవిషత్త్ ప్రజాపాలన):** దేవాదుల రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసినట్లు ఆర్భాటంగా ప్రచారం చేసుకోవడం తప్ప.. రైతుల పొలాలకు చుక్క నీరు చేరలేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం దేవరుప్పుల మండలంలో సుమారు 10 కిలోమీటర్లు పాదయాత్ర చేసి కాలువలను పరిశీలించారు. అనంతరం సింగరాజుపల్లిలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట వరకు నీటిని విడుదల చేసి 57 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. దేవరుప్పుల, కోడకండ్ల మండలాల్లోని ఏ చెరువైనా నిండిందా? ఏ పొలానికైనా నీరు చేరిందా? అని ప్రశ్నించారు. దేవాదుల రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉన్నా వినియోగించుకోవడం లేదని ఆరోపించారు.

**16 బోర్లు వేసినా నీరు పడలేదు**

పాదయాత్ర సందర్భంగా ధరావత్‌తండాకు చెందిన రైతు కున్సోతు వెంకన్నను ఎర్రబెల్లి పరామర్శించారు. నాలుగు ఎకరాల్లో సాగు చేసిన పంట ఎండిపోయిందని, ఇప్పటివరకు 16 బోర్లు వేసినా ఒక్కదానిలోనూ నీరు పడలేదని వెంకన్న కన్నీటిపర్యంతమయ్యారు. రైతుకు ధైర్యం చెప్పిన ఎర్రబెల్లి.. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

**ధర్నాలో తోపులాట.. ఎర్రబెల్లికి గాయం**

సింగరాజుపల్లిలో ధర్నా చేస్తున్న ఎర్రబెల్లిని పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో ఎర్రబెల్లి తలకు గాయమైంది. అయినప్పటికీ ఆయన ధర్నా కొనసాగించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఎర్రబెల్లి విమర్శించారు. రైతుబంధు, 24 గంటల విద్యుత్తు, ఎరువుల సరఫరా, రైతుబీమా తదితర అంశాల్లో రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. దేవరుప్పుల, కోడకండ్ల మండలాల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా పీఆర్‌జీటీఏ



● **మృత గురుకుల ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక చేయూత**

● **సభ్యుల సంక్షేమమే లక్ష్యం.. కష్టకాలంలో కుటుంబాలకు అండగా నిలుస్తాం**

**పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా,మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** సభ్యుల సంక్షేమం, కుటుంబాల భద్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పీఆర్‌జీటీఏ) మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. ఆపదలో ఉన్న సభ్యుల కుటుంబాలకు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నిరూపిస్తూ ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందిన టీజీఎంఆర్‌జేసీ మహబూబాబాద్ బాయ్స్-1లో పీజీటీ మ్యాథ్స్ (అవుట్‌సోర్సింగ్)గా పనిచేసిన షేక్ గౌస్ మియా కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించింది. పీఆర్‌జీటీఏ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.1,00,000 విలువైన చెక్‌ను కుటుంబ సభ్యులకు అందజేసి కష్టకాలంలో వారికి భరోసాగా నిలిచింది. పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ గౌస్ మియా స్వగృహానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. షేక్ గౌస్ మియా మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న నేపథ్యంలో సభ్యులు వారికి ధైర్యం చెప్పారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ సంఘం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

**సభ్యుడి కుటుంబానికి సంఘం భరోసా**

పీఆర్‌జీటీఏలో క్రియాశీల సభ్యుడిగా సేవలందించిన షేక్ గౌస్ మియా కుటుంబానికి ఆపద సమయంలో కొంతైనా ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో సంఘం వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.1 లక్ష అందజేసినట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ ఆర్థిక సహాయాన్ని ఆయన సతీమణి షాకిరా బేగం, కుమార్తె కుమారి షేక్ సమ్రీన్ నసీరాకు అందజేశారు. సభ్యులు కేవలం ఉద్యోగ సంబంధిత సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా, సభ్యుల కుటుంబాలకు కష్టసమయంలో అండగా నిలవాలనే ఉద్దేశంతో వెల్ఫేర్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. సభ్యుడి కుటుంబంలో చోటుచేసుకున్న విషాద సమయంలో తోటి సభ్యులు, సంఘం కలిసి నిలబడటం ద్వారా కుటుంబానికి మానసిక ధైర్యం కల్పించడంతో పాటు ఆర్థికంగా కూడా కొంత ఊరట కలిగించవచ్చని పేర్కొన్నారు.

**'సభ్యుల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం'**

ఈ సందర్భంగా పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సభ్యుల సంక్షేమమే పీఆర్‌జీటీఏ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సంఘంలో పనిచేస్తున్న ప్రతి సభ్యుడి కుటుంబాన్ని తమ కుటుంబంగానే భావిస్తామని తెలిపారు. "సభ్యుడు ఆపదలో ఉన్నప్పుడు సంఘం చూస్తూ ఊరుకోదు. ముఖ్యంగా కుటుంబానికి అండ అవసరమైన సమయంలో పీఆర్‌జీటీఏ బాధ్యతగా ముందుకు వచ్చి సహాయం చేస్తుంది. షేక్ గౌస్ మియా కుటుంబానికి ఈ రోజు అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సహాయం కేవలం నగదు సహాయం మాత్రమే కాదు.. కుటుంబానికి సంఘం అండగా ఉందనే భరోసా. వారి కుటుంబానికి పీఆర్‌జీటీఏ ఎల్లవేళలా తోడుగా ఉంటుంది" అని అన్నారు. సంఘ సభ్యుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ ఫండ్ ద్వారా అవసరమైన సందర్భాల్లో బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ సభ్యుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

**పరస్పర సహకారానికి నిదర్శనం**

సభ్యుల కష్టసుఖాల్లో భాగస్వాములుగా ఉండటం పీఆర్‌జీటీఏ ప్రత్యేకతగా కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఒక సభ్యుడి కుటుంబానికి కష్టం వచ్చినప్పుడు రాష్ట్రం నుంచి జిల్లా స్థాయి వరకు సంఘం నాయకత్వం, సభ్యులు కలిసి అండగా నిలవడం సంఘంలోని ఐక్యతకు నిదర్శనమన్నారు. షేక్ గౌస్ మియా కుటుంబాన్ని పరామర్శించిన సందర్భంగా ఆయనతో కలిసి పనిచేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సహచర ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా మెలిగేవారని, ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు సహచరులకు కూడా తీరని లోటుగా మిగిలిందని పేర్కొన్నారు.

**రాష్ట్ర, జిల్లా నాయకుల పరామర్శ**

ఈ కార్యక్రమంలో పీఆర్‌జీటీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఉప్పు అశోక్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఐ. నిర్మలానందం, టీజీఎంఆర్‌ఈఐఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిదేటి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు చలకాని సంజీవరెడ్డి, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు స్టాన్లీ డెన్జిల్, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శివాజీ, ఉపాధ్యక్షుడు వికాస్ సబావత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పీఆర్‌జీటీఏ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొని షేక్ గౌస్ మియా కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కుటుంబానికి అన్ని విధాలా అండ**

షేక్ గౌస్ మియా కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు మానసిక ధైర్యాన్ని కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పీఆర్‌జీటీఏ నాయకులు తెలిపారు. సభ్యుల సంక్షేమం కోసం సంఘం తరఫున చేపడుతున్న కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని చెప్పారు. సభ్యుల కుటుంబాల్లో ఆపద వచ్చినప్పుడు 'మేమున్నాం' అనే ధైర్యాన్ని కల్పించడమే సంఘం నిజమైన బలం అని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో సహచరులుగా ఉన్న వారు కష్టకాలంలో కుటుంబ సభ్యులుగా మారి అండగా నిలవడం పీఆర్‌జీటీఏ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్**

**రంగారెడ్డి జిల్లా,మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** దేశంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటికీ తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ బస్టాప్ నుండి రైస్ మిల్ అసోసియేషన్స్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.డి. అబ్బాస్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన భారతదేశంలో యువత భవిష్యత్తు నిరుద్యోగ కోరల్లో చిక్కుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం, 12 ఏళ్లు గడుస్తున్నా ఆ హామీని నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాల గురించి ప్రశ్నించే యువతకు "పకోడీలు, బజ్జీలు వేయడం కూడా ఉద్యోగమే" అంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానాలు ఇస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో వెల్లడించిన లెక్కల ప్రకారమే కేంద్ర ప్రభుత్వ శాఖల్లో దాదాపు 10 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యను పక్కనపెట్టి మతోన్మాద రాజకీయాలను రెచ్చగొట్టడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడమే కేంద్ర ప్రభుత్వ విధానంగా మారిందని దుయ్యబట్టారు. అలాగే రాష్ట్రంలో గత పదేళ్ల



బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను వంచించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా యువత ఆశలను వమ్ము చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని యూత్ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పటివరకు కేవలం 16 వేల కొత్త ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏటా దాదాపు 9 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారని, ప్రస్తుతం 2 లక్షలకు పైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించే వరకు నిరుద్యోగులకు నెలకు రూ. 5,000 నిరుద్యోగ భృతి ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్‌ను తూచా తప్పకుండా అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షలకు పైగా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలని, మెగా డీఎస్సీ, జేఎల్, డీఎల్, గ్రూప్-1, 2, 3, 4లతో పాటు పోలీస్ శాఖలోని 20 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని, ఎలాంటి వివాదాలు, కోర్టు కేసులు లేకుండా వివాదాస్పదమైన జీవోలను తొలగించి పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధి లభించే వరకు నెలకు రూ. 5,000 నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు విట్టల్, నాగేశ్వరరావు, శ్రావణ్, కోటయ్య, మీనా, సత్తార్, లక్ష్మమ్మ, శశికళ, కిషన్, కృష్ణ, బాబర్ ఖాన్, శామేష్, శ్రీను తదితరులతో పాటు నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు - GO 97ను వెంటనే రద్దు చేయాలి!

**మహేశ్వరం నియోజకవర్గశీలోని బడంగ్పేట్:** పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై మహేశ్వరం నియోజకవర్గశీలోని బడంగ్పేట్‌లోని నిరసన చేపట్టిన BRSV రాష్ట్ర కార్యదర్శి షేర్ రమణ్ గారు, ప్రభుత్వం GO 97ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. PPP విధానంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సాంకేతిక విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వాని డిమాండ్ చేశారు... ఈ కార్యక్రమంలో BRSV రాష్ట్ర నాయకులు తుప్పతి శ్రీకాంత్, మహేశ్వరం బ్రష్వనాయకులు చింటు నేత, సాయి శివప్రసాద్, గుఫ్రాన్ పటేల్, పండు తదితరులు




పాల్గొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం BRSV పోరాటం కొనసాగుతుంది!


## ఘనంగా బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముదిగొండ హరిదాస్ జన్మదిన వేడుకలు



●ముఖ్య అతిథిగా హాజరైన దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్ద్య:** దేవరకొండ/బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు ముదిగొండ హరిదాస్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరై ముదిగొండ హరిదాస్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరిదాస్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు,బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజక వర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, కౌన్సిలర్లు పొట్ట మురళి, పొట్ట మధు, సర్పంచ్ ఆడారపు హరికృష్ణ,బొడ్డు మల్లేష్, జమీర్ బాబా,గుండాల వెంకట్, మైనంపల్లి ప్రవీణ్, బత్తుల ఆంజనేయులు, ప్రశాంత్, లడ్డు తదితరులు పాల్గొని హరిదాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## బదిలీపై వెళ్లిన ఎస్సై వరప్రసాద్‌కు ఘన సన్మానం



●ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన వరప్రసాద్ సేవలు అభినందనీయం: రూప్‌సింగ్ రాథోడ్

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న వరప్రసాద్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. రంగారెడ్డి జిల్లా జనసేన పార్టీ గిరిజన నాయకుడు పాత్లవత్ రూప్‌సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి ఎస్సై వరప్రసాద్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ గిరిజన నాయకుడు పాత్లవత్ రూప్‌సింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ఎస్సై వరప్రసాద్ సేవలు అభినందనీయమన్నారు. పోలీసు అధికారిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన వరప్రసాద్ భవిష్యత్తులో పోలీసు శాఖలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయన ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజల ఆదరాభిమానాలను పొందుతూ మంచి పేరు సంపాదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై వరప్రసాద్ సేవలను నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా కొనియాడారు. కార్యక్రమంలో రూప్‌సింగ్, సేవ్య, నరేంద్ర, గోపి, రమేష్ సర్పంచ్, రూప్‌సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి టీకాకు డిజిటల్ నమోదు తప్పనిసరి





●యు-విన్ పోర్టల్‌పై నాగర్‌కర్నూల్ డివిజన్ ఏఎన్ఎంలు, డీఈఓలకు ప్రత్యేక శిక్షణ

**నాగర్‌కర్నూల్:** డిజిటల్ వ్యాక్సినేషన్ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు యు–విన్ (U-WIN) పోర్టల్ వినియోగంపై నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోని ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఇమ్యూనైజేషన్ అధికారి కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని ఏఎన్ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తమకు కేటాయించిన ట్యాబ్‌లతో హాజరయ్యారు. లబ్ధిదారుల నూతన నమోదు, టీకా డోసుల నమోదు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ, డేటా అప్‌డేషన్‌తో పాటు పోర్టల్‌లో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారంపై సిబ్బందికి ప్రత్యక్షంగా ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ, ప్రతి చిన్నారి, గర్భిణికి సంబంధించిన వ్యాక్సినేషన్ వివరాలను 100 శాతం కచ్చితంగా యు–విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియలో యు–విన్ పోర్టల్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో టీకా సేవలు అందించిన వెంటనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా లబ్ధిదారులకు టీకా సర్టిఫికెట్లు, తదుపరి డోసులకు సంబంధించిన సమాచారం సకాలంలో అందుతుందన్నారు. నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి లబ్ధిదారుడి వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేసి వ్యాక్సినేషన్ డిజిటలైజేషన్ లక్ష్యాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, ఏపీఓ రాజేశ్వర్, యు–విన్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, వీసీసీఎం దివ్య, హెచ్ఈఓ శ్రీనివాసులు, ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మనసుల్లో నిలిచిన అధికారి.. ఎస్సై వరప్రసాద్‌కు ఘన సన్మాన



●ప్రజలతో మమేకమై సేవలందించిన వరప్రసాద్ సేవలు అభినందనీయం

●అధికారి బదిలీ కావచ్చు.. ప్రజల హృదయాల్లో సంపాదించిన గౌరవం మాత్రం శాశ్వతం: పుష్పాబాయి

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** ప్రజలతో మమేకమై, వారి సమస్యలను ఓపికగా వింటూ, ఆపదలో అండగా నిలిచిన కడ్తాల్ ఎస్సై వరప్రసాద్‌కు ఘనమైన ఆత్మీయ వీడ్కోలు లభించింది. కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సందర్భంగా జనసేన పార్టీ రంగారెడ్డి జిల్లా వీర మహిళ అధ్యక్షురాలు పుష్పాబాయి ఆధ్వర్యంలో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విధులు ఎక్కడైనా నిర్వహించవచ్చు.. కానీ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించడం ప్రతి అధికారికి సాధ్యం కాదని, తన సేవా తీరుతో వరప్రసాద్ ప్రజల అభిమానం, విశ్వాసాన్ని పొందారని ఈ సందర్భంగా పుష్పాబాయి కొనియాడారు.

**'అధికారి బదిలీ కావచ్చు.. గౌరవం మాత్రం బదిలీ కాదు'**

ఈ సందర్భంగా పుష్పాబాయి మాట్లాడుతూ.. పోలీసు అధికారి అంటే కేవలం శాంతిభద్రతలను పరిరక్షించే వ్యక్తి మాత్రమే కాదని, ప్రజల కష్టాలను అర్థం చేసుకుని, అవసరమైన సమయంలో వారికి అండగా నిలిచే బాధ్యతాయుతమైన ప్రజాసేవకుడిగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. ఆ దిశగా ఎస్సై వరప్రసాద్ తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించారని ప్రశంసించారు. సామాన్య ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకువచ్చే విధంగా అందుబాటులో ఉండటం, సమస్యలను ఓపికగా వినడం, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ చూపడం వరప్రసాద్ ప్రత్యేకతగా నిలిచిందన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ పోలీసు శాఖపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచేందుకు ఆయన కృషి చేశారని తెలిపారు. "బదిలీ అనేది ఉద్యోగ జీవితంలో సహజమైన ప్రక్రియ. కానీ ఒక అధికారి బదిలీపై వెళ్తున్నప్పుడు ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికి, ఆత్మీయంగా సన్మానించడం ఆయన చేసిన సేవలకు దక్కిన అసలైన గౌరవం. అధికారి బదిలీ కావచ్చు.. కానీ ప్రజల మనసుల్లో సంపాదించుకున్న గౌరవం మాత్రం ఎప్పటికీ బదిలీ కాదు. ప్రజలకు చేసిన సేవ, చూపిన మంచితనం, పలికిన ఆత్మీయ మాటలు ప్రజల జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి" అని పుష్పాబాయి అన్నారు.

**ప్రజల విశ్వాసమే పోలీసు అధికారికి అసలైన పురస్కారం**

కడ్తాల్ ప్రాంతంలో విధులు నిర్వహించిన కాలంలో ఎస్సై వరప్రసాద్ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే ప్రజలకు అందుబాటులో ఉన్నారని పుష్పాబాయి తెలిపారు. ప్రతి ఒక్కరి సమస్యను సమాన దృష్టితో చూడటం, బాధితులకు భరోసా కల్పించడం, ప్రజలు--పోలీసుల మధ్య సత్సంబంధాలను పెంపొందించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. "పోలీసు అధికారికి పతకాలు, ప్రశంసా పత్రాలు మాత్రమే గౌరవం కాదు.. ప్రజలు తమ సమస్య చెప్పుకోవడానికి ధైర్యంగా పోలీస్‌స్టేషన్ తలుపు తట్టగలగడం, ఆ అధికారి తమకు న్యాయం చేస్తారనే నమ్మకం కలగడం అంతకంటే గొప్ప పురస్కారం" అని పుష్పాబాయి పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం అహర్నిశలు విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది సేవలను సమాజం గుర్తించాలని అన్నారు. వరప్రసాద్ వంటి అధికారులు ప్రజలతో మానవీయంగా మెలుగుతూ సేవాభావంతో పనిచేయడం అభినందనీయమన్నారు.

**సేవకు వీడ్కోలు లేదు.. జ్ఞాపకాలకు ముగింపు లేదు**

ఒక ప్రాంతంలో విధులు నిర్వహించి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లడం పోలీసు ఉద్యోగంలో సాధారణమే అయినప్పటికీ.. ప్రజలతో ఏర్పడిన అనుబంధానికి ఎలాంటి బదిలీ ఉండదని పుష్పాబాయి అన్నారు. కడ్తాల్‌లో వరప్రసాద్ అందించిన సేవలు, ప్రజలతో ఆయన ఏర్పరచుకున్న సత్సంబంధాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. వరప్రసాద్ భవిష్యత్తులో పోలీసు శాఖలో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టాలని, తన సేవా ప్రస్థానంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పుష్పాబాయి ఆకాంక్షించారు. ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజలకు చేరువగా ఉంటూ, నిజాయితీ, నిబద్ధత, సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు.

**సేవాభావంతో పనిచేసే అధికారులకు ప్రజలే బలం**

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందడం ప్రతి పోలీసు అధికారికి గొప్ప విజయమని అన్నారు. వరప్రసాద్ తన విధి నిర్వహణలో ఆ విశ్వాసాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసిన అధికారిని బదిలీపై సాగనంపుతున్న సమయంలో సన్మానించడం ద్వారా ఆయన సేవలను గుర్తుచేసుకున్నామని తెలిపారు. కడ్తాల్ ప్రజలతో వరప్రసాద్‌కు ఏర్పడిన అనుబంధం ఆయన బదిలీతో ముగిసేది కాదని, ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు.

**ఘనంగా ఆత్మీయ వీడ్కోలు**

కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, రంగారెడ్డి జిల్లా వీర మహిళ విభాగం ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై వరప్రసాద్‌కు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. వరప్రసాద్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆకాంక్షిస్తూ ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

## ఎలాంటి షరతులు లేకుండా ఫీజు బకాయిలు స్కాలర్షిప్లు 8,000 కోట్లను వెంటనే చెల్లించాలని

ఎలాంటి షరతులు లేకుండా ఫీజు బకాయిలు స్కాలర్షిప్లు 8,000కోట్లను వెంటనే చెల్లించాలని రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పద్ధతి ప్రకారం పీసెస్ స్కీం కొనసాగించాలని విద్యార్థుల వద్ద ఫీజులు వాపస్ చేయరా బస్సులు చేరాదని కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం ప్రకారం కాలేజ్ కోర్సు చదివే విద్యార్థులు ఫీజులు పూర్తిగా చెల్లించాలని కాలేజీ కోర్స్ చదివే విద్యార్థులు స్కాలర్షిప్‌లోను ఆంధ్రప్రదేశ్ మాదిరిగా ప్రతి విద్యార్థికి రూ. 5,000లు నుంచి 20వేల వరకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు ఫీజుల స్కీమును ఎత్తివేసే కుట్రలు మానుకొని యథావిధిగా అమలు చేయాలని 8,000కోట్ల రూపాయలు ఫీజు బకాయి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ల ఆర్డీవోల ఎమ్మార్వోల ఆఫీసులో ముట్టడించే దిశగా ప్రదర్శనలు విద్యార్థులు నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఆయన కోరారు ప్రభుత్వం మొండి వైఖరి అవలంబించడం వల్ల సరికాదని విద్యార్థుల బుద్ధిమంతు తక్కువ అంచనా సరికాదని తెలంగాణ విద్యార్థుల పరిస్థితి అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి వారి విషయంలో సానుకూలంగా స్పందించి విద్యార్థులకు ఫీజులు బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన కోరారు ఎస్సీ బీసీ ఎస్టీ గురుకులాలను గోకుల మీద ఎందుకు ఎందుకంత కక్ష కట్టారో అర్థం కావడం లేదని ముఖ్యమంత్రి ఇలా ప్రజాస్వామ్ని వ్యతిరేకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ పేతురేఖ చర్యలు పాల్పడుతు న్నారో ఎవరికి అర్థం కావడం లేదని ఆయన ఆరోపించారు ఎస్సీ హాస్టల్ అభివృద్ధి కోసం ఎస్టి హాస్టల్ అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపడుతున్నారని అలాగే బీసీ విద్యార్థుల కోసం హాస్టలను మెరుగుపరిచి సొంత భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎలాంటి షరతులు లేకుండా ఫీజుల బకాయిలు స్కాలర్షిప్లు 8 వేల కోట్లు వెంటనే చెల్లించాలని



ఎలాంటి షరతులు లేకుండా ఫీజుల బకాయిలు స్కాలర్షిప్లు 8 వేల కోట్లు వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు గురువారం నాడు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పద్ధతి ప్రకారం ఫీజుల స్కీం కొనసాగించాలని విద్యార్థుల వద్ద పీసులు వాపస్తులు చేయరాదని ఆయన కోరారు కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం ప్రకారం కాలేజీల కోర్సులు చదివి విద్యార్థులు పూర్తిగా చెల్లించాలని కాలేజీల కోర్సులు చదివి విద్యార్థుల స్కాలర్షిప్లను ఆంధ్రప్రదేశ్ మాదిరిగా ప్రతి విద్యార్థికి రూపాయలు 5వేల నుంచి 20వేల వరకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు ఈ నెల రాష్ట్రవ్యాప్తంగా 25న కలెక్టరేట్ల ఆర్డిఓ ల ఎమ్మార్వోల కార్యాలయాల ముట్టడి జరుగుతుందని ఆ కార్యక్రమాన్ని విద్యార్థులు జయప్రదం చేయాలని ఆయన కోరారు ప్రభుత్వం మొండి వైఖరి అవలంబించడం వల్ల విద్యార్థుల న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని ఆయన కోరారు బకాయిలు ఎన్ని వేల కోట్లు చెల్లించడం ముఖ్యమంత్రికి ఒక లెక్క కాదు మూడు సంవత్సరాల విద్యార్థి పడుతున్న బాధలు చెప్పనంత అవసరం కాదు కోర్సు పూర్తయిన వారికి కాలేజీ యాజమాన్య సద్వికుడు ఇవ్వడం లేదని చదువుతున్న వారి ఫీజులు కూడా కట్టడం లేదని కాలేజీలకు బకాయిలు కూడా చెల్లించడం లేదని ఆయన ఆరోపించారు తక్షణమే బకాయిలను విడుదల చేయాలని ఆయన కోరారు ప్రభుత్వం విడుదల చేసిన మని చెప్తున్న ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆయన ఆరోపించారు పాలిటెక్నిక్ కాలేజీలో రద్దు చేయాలని ప్రభుత్వం చూస్తుందని కాలేజ్ అమ్ముకోవడానికి ప్రభుత్వం కొత్త రకమైన ప్లానింగ్ మొదలుపెట్టిందని ఆయన ఆరోపించారు.

## రాజాపూర్‌లో గుర్తుతెలియని మహిళ మృతదేహం

●ఎన్‌హెచ్-44 సమీపంలో కలకలం.. గుర్తింపు కోసం పోలీసుల ప్రయత్నం

**భవిష్యత్ ప్రజాపాలన చేవెళ్ల , ఆగస్టు 20 చేవెళ్ల నియోజకవర్గం :** రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి–44 సమీపంలో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించడం కలకలం రేపింది. రంగారెడ్డిగూడ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద రహదారి పక్కన మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసుల వివరాలు వెల్లడిస్తున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు సుమారు 5 అడుగుల 1 అంగుళం ఎత్తు, సాధారణ శరీరాకృతి, గుండ్రటి ముఖం, నల్లటి జుట్టు కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఆమె చేతికి గాజులు ఉన్నట్లు ఫొటోల్లో కనిపిస్తున్నాయి. అయితే మృతురాలి పేరు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు ఇప్పటివరకు తెలియరాలేదు. ఈ ఘటనపై రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో FIR నం. 185/2026, తేదీ 19–08–2026గా కేసు నమోదు చేశారు. BNS సెక్షన్లు 103(1), 238 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసుల పత్రంలో పేర్కొన్నారు. మృతురాలి ఫొటోను పోలీసులు విడుదల చేసి, ఆమెను ఎవరైనా గుర్తించినట్లయితే లేదా ఆమె కుటుంబ సభ్యులు, బంధువుల గురించి సమాచారం తెలిసినట్లయితే రాజాపూర్ పోలీసులను సంప్రదించాలని కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతురాలి గుర్తింపు తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సమాచారం కోసం:
SI రాజాపూర్: 8712669347
CI జడ్చర్ల రూరల్: 8712659315
PS రాజాపూర్: 8712665216




## ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నం.. నిందితుడి అరెస్ట్



**భవిష్యత్ ప్రజాపాలన ఆగస్టు 20 షాబాద్ చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి 14 రోజుల న్యాయ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్ ఫతేనగర్‌లోని ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన వేముల నర్సింహ అలియాస్ చిమకాండ్ల నర్సింహ (36) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. గతంలోనూ దొంగతనం కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లిన నిందితుడు, ఇటీవల 04.08.2026న జైలు నుంచి విడుదలయ్యాడు. అనంతరం మద్యం సేవించడం, వ్యక్తిగత ఖర్చుల కోసం డబ్బులు అవసరం కావడంతో తిరిగి దొంగతనానికి పాల్పడాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. నగర ప్రాంతంలో దొంగతనానికి పాల్పడితే త్వరగా పట్టుబడే అవకాశం ఉందని భావించి శంకర్‌పల్లిని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో 19.08.2026 ఉదయం సనత్‌నగర్‌లో రైలు ఎక్కి శంకర్‌పల్లి చేరుకున్న నిందితుడు, అక్కడి నుంచి వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చోరీకి అనువైన ఇంటి కోసం పరిశీలించాడు. సాయంత్రం బ్లూవుడ్స్ వెంచర్‌లో గాయత్రి అనే మహిళకు చెందిన తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి, చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకున్న అనంతరం తన వెంట తెచ్చుకున్న సుమారు ఒక అడుగు పొడవైన ఇనుప రాడ్‌తో ఇంటి తాళం పగులగొట్టేందుకు ప్రయత్నించాడు. తాళం పగులగొడుతున్న శబ్దం విని కాలనీ వాసి నరసింహారెడ్డి, ఇతరులు అక్కడికి చేరుకుని నిందితుడిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి నిందితుడిని అప్పగించారు. నిందితుడి వద్ద నుంచి చోరీకి ఉపయోగించిన ఇనుప రాడ్‌తో పాటు మొబైల్ ఫోన్‌ను పోలీసులు పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. గతంలో సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు దొంగతనం కేసుల్లో నిందితుడు అరెస్టై జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి 14 రోజుల న్యాయ రిమాండ్‌కు తరలించారు.

# నేటి నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు

●క్షేత్రస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపే దిశగా
●మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాచరణ



**హైదరాబాద్, భవిష్యత్ ప్రజాపాలన:** సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 20. : ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడం, భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను నిర్దేశించే విధంగా కొనసాగనున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించడంతో పాటు, దూర ప్రాంత జిల్లాలకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లతో సహా సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమీక్షల్లో పాల్గొంటారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా సమీక్షల్లో భాగస్వాములను చేసి.. ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానిక అవసరాలు, పరిష్కరించాల్సిన అంశాలను నేరుగా తెలుసుకునే విధంగా మంత్రిగారు ఈ సమీక్షలను నిర్వహించనున్నారు.

**హౌసింగ్ అమలుపైనా సమీక్ష**

రెవెన్యూ అంశాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, హౌసింగ్ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు తదితర అంశాలను కూడా జిల్లా సమీక్షల్లో మంత్రి పరిశీలించనున్నారు.

**మొదటి సమీక్ష జగిత్యాలలో..**

జిల్లాల వారీగా చేపట్టనున్న సమీక్షల్లో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.

# ప్రెస్ మీట్ ఏ తెలంగాణ భవన్

**మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత**



రాష్ట్రంలో ఎన్ని హత్యలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు, రాష్ట్రంలో శాంతిభద్రతలు రేవంత్ రెడ్డికి గాలికి వదిలేశారనే అనుమానం వస్తోంది. ఒక్క ఇంట్లోనే ఆరుగురు మహిళలు హత్యకు గురి కావాల్సిన పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్యూర్ స్పష్టంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి. కేసీఆర్ షీ టీమ్స్ ఏర్పాటు చేసి మహిళలకు భద్రత కల్పించారు. గ్రామాల్లో డ్రగ్స్, గంజాయి, మద్యంతో యువత బలైపోతోంది. యువత మద్యం మత్తులో ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదని అనే భావనలో సీఎం ఉన్నారు. రాష్ట్రంలో చదువు చెప్పే టీచర్ సీఎం రేవంత్ రెడ్డి హోం మంత్రిగా ఫెయిల్ అయ్యారు. రిటైర్డ్ ఐపీఎస్ భార్యను హత్య చేసినా పట్టించుకోలేదు. నల్గొండ జిల్లాలో ప్రైవేట్ స్కూల్ టీచర్ ను హత్య చేసినా సీఎం స్పందించలేదు, సీఎం లండన్,అమెరికా టూర్లకు వెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యాపారాలపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు, తెలంగాణలో వందల కోట్ల విలువ చేసే డ్రగ్స్ దొరికాయి, రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం విపరీతంగా పెరిగింది. కేంద్ర మంత్రి కొడుకుకు సీఎం రేవంత్ రెడ్డి రక్షణ కల్పించారు. ఫోక్సో చట్టాలకు అనుగుణంగా శిక్ష వేయాలి కానీ యథేచ్ఛగా ఫోక్సో నిందితుడు బయట తిరుగుతున్నారు. రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగింది. రాష్ట్రంలోమహిళలకు భద్రత లేదు, మైనర్ బాలికపై వృద్ధుడు అఘాయిత్యం ప్రవర్తిస్తే ప్రభుత్వం పట్టించు కోలేదు. షాబాద్ లో ఒక ఉన్మాద ఆరుగురు మహిళలను హత్య చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకాలు జరుగుతున్నాయి. రేవంత్ రెడ్డి డ్రగ్స్ అరికట్టడంలో మాటలకే పరిమితం అయ్యారు. ఈగల్ ఫోర్స్ పని చేస్తుందా ఈగలు కొడుతుందా అనే అనుమానం వస్తోంది. కొండమల్లేపల్లిలో ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య వెనుక డ్రగ్స్ మాఫియా హస్తంపై విచారణ చేయాలి.ఈ హత్య వెనుక ఏమైనా కుట్ర ఉందా అనే కోణంలో విచారణ చేయాలి. కేసీఆర్ పోలీసు శాఖలో అనేక సంస్కరణలు చేశారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.రేవంత్ రెడ్డి సీఎంగా, హోంమంత్రిగా,విద్యా శాఖ మంత్రిగా ఫెయిల్ అయ్యారు కాబట్టి సీఎం రాజీనామా చేయాలి

**జడ్పీ మాజీ చైర్పర్సన్ తుల ఉమ**

రాష్ట్రంలో శాంతిభద్రతలు రేవంత్ రెడ్డికి గాలికి వదిలేశారనే అనుమానం వస్తోంది. ఒక్క ఇంట్లోనే ఆరుగురు మహిళలు హత్యకు గురి కావాల్సిన పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్యూర్ స్పష్టంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి. కేసీఆర్ షీ టీమ్స్ ఏర్పాటు చేసి మహిళలకు భద్రత కల్పించారు. గ్రామాల్లో డ్రగ్స్, గంజాయి, మద్యంతో యువత బలైపోతోంది. యువత మద్యం మత్తులో ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదని అనే భావనలో సీఎం ఉన్నారు. రాష్ట్రంలో చదువు చెప్పే టీచర్ కు విద్యార్థుల నుంచి రక్షణ లేదు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల మీటింగ్‌లో పేగులు తీసి మెడలో వేసుకుంటామని బూతులు మాట్లాడుతున్నారు. కరీంనగర్ లో పట్ట పగలు జ్యువెల్లరీ షాప్ లో దొంగతనం జరిగింది. ఆన్ లైన్ లో అశ్లీలత పెరిగి పోతోంది. చిన్న పిల్లలు ఫోన్లకు ప్రభావితం అవుతున్నారు. సమాజంలో స్త్రీల పట్ల గౌరవం లేకుండా పోయింది. ప్రభుత్వం డ్రగ్స్ కంట్రోల్ చేసే విధంగా చర్యలు చేపట్టాలి. హైదరాబాద్ లో 10 వేల కోట్ల డ్రగ్స్ ను మహారాష్ట్ర పోలీసులు వచ్చి పట్టుకున్నారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

# జన్వాడ ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ..
# ఆధునిక వసతులతో కొత్త భవనం



●రూ.5 కోట్లతో నిర్మాణం.. 650 మంది విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం
●20 గదులు, 6 వాష్‌రూమ్స్‌తో అందుబాటులోకి నూతన సౌకర్యాలు
●కేటీఆర్ ప్రత్యేక చొరవతో నిర్మాణం.. ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి

**భవిష్యత్ ప్రజాపాలన ఆగస్టు 20 జన్వాడ చేవెళ్ల**





**నియోజకవర్గం :** చేవెళ్ల నియోజకవర్గం జన్వాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన భవనం అందుబాటులోకి వచ్చింది. సరిపడా తరగతి గదులు, వాష్‌రూమ్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక చొరవతో సామాజిక బాధ్యత నిధుల ద్వారా సుమారు రూ.5 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. 16 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నూతన భవనంలో 20 తరగతి గదులు, 6 వాష్‌రూమ్స్ ఉండటంతో పాటు సుమారు 650 మంది విద్యార్థులకు సరిపడేలా ఆధునిక విద్యా సౌకర్యాలు కల్పించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పించేలా భవనాన్ని నిర్మించడంతో విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్యా వాతావరణం అందుబాటులోకి వచ్చింది. గతంలో తరగతి గదులు, వాష్‌రూమ్స్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులకు నూతన భవనం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. కేటీఆర్ ప్రత్యేక చొరవతో పాఠశాల భవన నిర్మాణం పూర్తికావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సబిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందన్నారు. నూతన భవనం ద్వారా జన్వాడ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ నియోజకవర్గంలో కమలాపూర్‌లో
## డబుల్ బెడ్రూం ఇళ్లపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్





●వారంలో ఇవ్వకపోతే.. పది రోజులైనా జాబితా లేదు! డబుల్ బెడ్రూం ఇళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం"
●కేసీఆర్ కట్టించిన ఇళ్లను పేదలకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోంది

**హుజూరాబాద్ MLA పాడి కౌశిక్ రెడ్డి**

**కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంలో నిర్మించిన 394 డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు కేటాయించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో ఈ డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ఒక్కో ఫ్లాట్‌కు సుమారు రూ.5.04 లక్షల చొప్పున ఖర్చు చేశారని తెలిపారు. అదనంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజ్, తాగునీటి వంటి మౌలిక వసతుల కల్పన కోసం ఒక్కో ఇంటికి రూ.1.25 లక్షల చొప్పున మొత్తం సుమారు రూ.4.92 కోట్లను కూడా మంజూరు చేశారని గుర్తు చేశారు. ఇటీవల కమలాపూర్‌కు వచ్చిన హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీని ప్రారంభిస్తూ వారం రోజుల్లో లబ్ధిదారుల పేర్లు ప్రకటించి ప్రొసీడింగ్స్ అందజేస్తామని ప్రకటించారని, కానీ పది రోజులు గడిచినా ఇప్పటి వరకు లబ్ధిదారుల జాబితా విడుదల చేయకపోవడం, ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. లబ్ధిదారుల పేర్లు ప్రకటించినా వారు నివసించే పరిస్థితి ప్రస్తుతం లేదని, గృహ సముదాయాల్లో రోడ్లు పూర్తికాలేదని, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదని, తాగునీటి సౌకర్యం లేదని, డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, అనేక ఇళ్లలో అద్దాలు పగిలిపోయాయని, బాత్రూమ్‌లు, తలుపులు కూడా సరిగా లేవని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలను ఇళ్లలోకి పంపడం సరైన విధానం కాదన్నారు. కమలాపూర్‌తో పాటు గూడూరు, మరిపల్లిగూడెం ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. కేసీఆర్ నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రులు ఆయన పేరును ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమేనని, ఆ విషయాన్ని ప్రజలకు చెప్పకుండా రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయని, లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారనే ఆడియోలు కూడా బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లు నిజమైన పేదల కోసమే నిర్మించారని, ఇల్లు లేని అర్హులైన కుటుంబాలకు మాత్రమే కేటాయించాలని, అనర్హులకు ఇళ్లు కేటాయించినట్లు తేలితే ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్ పెంపు, మహిళలకు ప్రకటించిన హామీలు, ఇతర సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను ప్రశ్నించేందుకు తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తన బాధ్యత అని అన్నారు. కమలాపూర్‌లోని 394, గూడూరులోని 50, మరిపల్లిగూడెంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితాను వెంటనే ప్రకటించి, ప్రొసీడింగ్స్ అందజేసి, మౌలిక వసతులు పూర్తి చేసి ఇళ్లను అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతామని, ప్రభుత్వం ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ వాజ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ గారు, మాజీ మార్కెట్ చైర్మన్ పోల్నేని సత్యనారాయణరావు గారు, కమలాపూర్ మండల సీనియర్ నాయకులు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు గారు, తక్కళ్లపల్లి సత్యనారాయణరావు గారు, ఇంద్రసేనారెడ్డి గారు, మాజీ జెడ్పీటీసీలు నవీన్ గారు, లక్ష్మణ్ గారు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజేష్ గారు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు దేశానికి చిరస్మరణీయం

**డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి**



మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను ఆమె స్మరించుకున్నారు. దేశాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ, సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. దేశంలో టెలికాం, కంప్యూటర్ రంగాల విస్తరణకు రాజీవ్ గాంధీ తీసుకున్న చర్యలు భవిష్యత్ భారత నిర్మాణానికి బాటలు వేశాయని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు ఓటు హక్కు కల్పించడం వంటి కీలక నిర్ణయాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాజీవ్ గాంధీ కృషి చేశారని ఆమె గుర్తుచేశారు. దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను, ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మన్ సుధానంత వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, కౌన్సిలర్లు గడ్డం రాజు, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో పండుగ
## సాయన్న జయంతి, వర్ధంతులపై అధికారిక ప్రకటన

●మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో పండుగ సాయన్న జయంతి, వర్ధంతులపై అధికారిక ప్రకటన
●మంత్రి వాకిటి శ్రీహరి కృషికి ఫలితం.. పండుగ సాయన్న జయంతి, వర్ధంతుల నిర్వహణకు అధికారిక ఉత్తర్వులు



**తేది:20-08-2026 హైదరాబాద్:** తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పండుగ సాయన్న జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. పండుగ సాయన్న జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఇటీవల రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, క్రీడలు & యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ప్రభుత్వం తాజాగా అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది. జీవో ప్రకారం ఇకపై ప్రతి సంవత్సరం అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతి, డిసెంబర్ 10న పండుగ సాయన్న వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈ నిర్ణయంపై మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పండుగ సాయన్న వంటి వీరుని పోరాటాన్ని, త్యాగాన్ని ప్రజా ప్రభుత్వం అధికారికంగా గుర్తించడం బహుజన సమాజానికి గర్వకారణమని అన్నారు. బహుజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుల పోరాట స్ఫూర్తిని గుర్తింపు-మంత్రి వాకిటి శ్రీహరి పండుగ సాయన్న కేవలం ఒక ప్రాంతానికే పరిమితమైన వీరుడు కాదని, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ప్రజా వీరుడని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఆయన జీవితం, పోరాటం, త్యాగం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలన్న ముదిరాజ్ సమాజం చిరకాల ఆకాంక్ష నెరవేరడం సంతోషకరమని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వానికి బహుజనుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. "ఒక వీరుని పోరాటాన్ని, త్యాగాన్ని ప్రజా ప్రభుత్వం గుర్తించడం బహుజనులందరికీ గర్వకారణం. పండుగ సాయన్న స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడం చారిత్రాత్మక నిర్ణయం" అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ నిర్ణయంతో ముదిరాజ్ సమాజంతో పాటు పండుగ సాయన్న అభిమానులు, బహుజన వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

### మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి


# జయంతిని పురస్కరించుకొని



మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని పాత పార్లమెంట్ సెంట్రల్ హాల్లో జరిగిన జయంతి వేడుకల్లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారు, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి శ్రీమతి సోనియా గాంధీ గారు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారు, ప్రియాంక గాంధీ గారుఏఐసీసీ జనరల్ సెక్రెటరీ ( ఆర్గనైజేషన్ ) కేసీ వేణుగోపాల్ గారు, ఎంపీ రాజీవ్ శుక్ల గారు, చింతా మోహన్ గారు తదితర నేతలతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి వారు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ గారు దేశానికి అందించిన సేవలను నేతలు గుర్తు చేసుకున్నారు. ప్రధానిగా దేశ అభ్యున్నతికి అనేక సంస్కరణలతో పాటు దేశంలో సమాచార, సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహనీయులు రాజీవ్ గాంధీ గారు అని ఈ సందర్భంగా మధుయాష్కీ గారు పేర్కొన్నారు.


# అనుమతుల్లేకుండా బోర్‌వెల్ తవ్వకాలు?

● నెక్నాంపూర్‌లో కె.ఎం. రెడ్డి బోర్‌వెల్స్‌పై ఫిర్యాదు




**హైదరాబాద్, మణికొండ ఆగస్టు 20 (భవిషత్ ప్రజాపాలన):** నెక్నాంపూర్‌లోని నయారా పెట్రోల్ బంక్ వెనుక భాగంలో కె.ఎం. రెడ్డి బోర్‌వెల్స్ సంస్థ అనుమతులు లేకుండా బోర్‌వెల్ డ్రిల్లింగ్ చేపడుతోందని ఆరోపిస్తూ హెచ్. అరుణ్‌కుమార్ గోల్కొండ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. భూగర్భ జలాల వెలికితీతకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని అధికారులు పరిశీలించాలని కోరారు. అనధికారిక బోర్‌వెల్ తవ్వకాలతో భూగర్భ జల వనరులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అనుమతులు లేకుండా డ్రిల్లింగ్ జరుగుతున్నట్లు తేలితే తవ్వకాలను నిలిపివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూగర్భ జలాల పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

# పేదింటి ఆడబిడ్డకు ఆర్థిక చేయూత



● **రూ.5,016 పెళ్లి కానుక అందజేసిన మబ్బు మహేష్**

**ఆలేరు, ఆగస్టు 20 (భవిష్యత్ ప్రజాపాలన ):** నిరుపేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు తనవంతు ఆర్థిక సాయం అందిస్తూ మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ చేయూతనిస్తున్నారు. కొల్లూరు గ్రామంలోని కేసీఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బాకి కళ్యాణి--కరుణాకర్ వివాహానికి ఆయన హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఫౌండేషన్ తరఫున రూ.5,016ను పెళ్లి కానుకగా అందజేశారు. గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రేణుక-కీ.శే. భిక్షపతి దంపతుల కుమార్తె కళ్యాణి వివాహం సందర్భంగా ఈ సాయం అందించారు. 'మానవ సేవే-మాధవ సేవ' లక్ష్యంతో ఆలేరు నియోజకవర్గంలోని గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాలకు అండగా నిలవడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మందుల రాజు, రామ్ బాకీ, మల్లేష్, బాకీ శోభన్‌బాబు, సుమన్, మేడ అయిలయ్య, బాలరాజు, మహేందర్, నవీన్, ప్రవీణ్, ప్రశాంత్, సోములు, మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయాన్ని

## రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు నేడు సందర్శించారు



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసేన్ ఆగస్టు 20.** :దాదాపు 50 మంది రిటైర్డ్ అధికారులు తమ కుటుంబాలతో సహా సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం ముందు అందరూ గ్రూప్ ఫోటో దిగారు.

# ఎంపీ వద్దిరాజు దక్షిణ మధ్య రైల్వే జోనల్ సమావేశంలో

## పలు అంశాలను ప్రస్తావించి,పరిష్కరించాల్సిందిగా అధికారులను డిమాండ్ చేశారు



కాజీపేట జంక్షన్, వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన కొత్తగూడెం రైల్వే స్టేషన్లను (భద్రాచలం రోడ్) డివిజన్ కేంద్రాలుగా ప్రకటిస్తూ అభివృద్ధి చేయాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. తెలంగాణలో సికింద్రాబాద్ రైల్వే జోనల్ కేంద్రం కాగా, హైదరాబాద్ ఒక్కటే డివిజన్‌గా ఉందని,ఈ దృష్ట్యా కాజీపేట, కొత్తగూడెంలను డివిజన్లుగా ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.బ్రిటీష్ వారి కాలంలో 1932లో కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఏర్పాటు జరిగిందని, దానికి భద్రాచలం రోడ్ స్టేషన్ అని నామకరణం చేశారన్నారు. అయితే, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీరామచంద్ర స్వామి కొలువైన భద్రాచలం క్షేత్రంలో రైల్వే స్టేషన్ లేకపోవడం విచారకరమన్నారు. భద్రాచలంకు రైలు మార్గాన్ని పొడగిస్తూ,ఒడిషా, ఛత్తీస్ ఘఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు దీనిని విస్తరించడం ద్వారా ఆదివాసీ, గిరిజనులకు మేలు జరుగుతుందని, ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీ రవిచంద్ర వివరించారు.సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్)పరిధిలోని పార్లమెంట్ మెంబర్స్ (ఎంపీలు)సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర హిందీలో మాట్లాడుతూ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు వివరించారు.భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, నిజామాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రజలు,ప్రయాణీకుల పక్షాన శ్రీవాస్తవకు ఎంపీ వద్దిరాజు వినతిపత్రం అందజేశారు,అనంతరం విలేకరులతో మాట్లాడారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తనతో పాటు పార్థసారథి రెడ్డి,రేణుకా చౌదరి, రఘురామిరెడ్డి,బలరాంనాయక్ మొత్తం 5 గురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పారు.ఈ జిల్లాలో రైల్వే శాఖ చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి తాము పలుమార్లు మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తేవడం జరిగిందని,ఈ మార్గాన్ని భద్రాచలం వరకు పొడిగిస్తూ, భవిష్యత్తులో దానిని 5 రాష్ట్రాలకు కూడలిగా తీర్చిదిద్దాలని,భక్తజనుల సౌకర్యార్థం ఇక్కడ నుంచి తిరుపతికి రైళ్లు నడపాల్సిందిగా కోరారు. అమృత్ భారత్ స్కీమ్ కింద ఖమ్మం రైల్వే స్టేషన్‌లో సుమారు రూ.37 కోట్లతో జరుగుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని సలహా నిచ్చారు. ఖమ్మం "ఏ" గ్రేడ్ రైల్వే స్టేషన్ కావడం వల్ల పార్కింగ్ ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారని, బయట ప్రైవేట్ పార్కింగ్‌లో రూ.20 లేదా రూ.30 వసూలు చేస్తుంటే, స్టేషన్‌లో రూ.100 వరకు వసూలు చేయడాన్ని అరికట్టాలని ఎంపీ రవిచంద్ర అధికారులను కోరారు. ఖమ్మం స్టేషన్‌లో ప్రయాణీకుల భద్రత దృష్ట్యా సీసీటీవీ కెమెరాలను ఇంకా పెంచాలని ఆయన సలహానిచ్చారు. ధంసలాపురం పాత రైల్వే గేట్ వద్ద అండర్‌పాస్ మంజూరు చేయాలని, మల్లెమడుగు రైల్వే స్టేషన్‌ను ఎత్తివేస్తారనే వదంతులకు అడ్డుకట్ట వేసి దానిని యథాతథంగా కొనసాగించాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ ర్యాక్ పాయింట్‌గా ఉపయోగిస్తుండటంతో రైల్వేకు మంచి ఆదాయం సమకూరుతున్నదని, దీనిని మరింత అభివృద్ధి చేయాల్సిందిగా సూచించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) ఆధునికీకరణ పనులను మరింత వేగవంతం చేస్తూ,వృద్ధులు, వికలాంగులు,చంటి పిల్లల తల్లులు 2వ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లడం ఇబ్బందిగా ఉన్నందున,. లిఫ్ట్, ఎస్కలేటర్ సదుపాయాలు కల్పించాలన్నారు. భజన మందిర్, రాజీవ్ పార్క్ వద్ద అండర్‌పాస్‌లు నిర్మించాలని ఎంపీ రవిచంద్ర కోరారు. భద్రాచలం రోడ్ కొత్తగూడెం నుంచి తిరుపతికి ప్రత్యేక ట్రైన్ కావాలని ప్రయాణికులు ఎప్పటినుంచో అడుగుతున్నారని, దీనిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్-బెల్గావి ఎక్స్‌ప్రెస్ రైలును కోవిడ్‌కు ముందు లాగా మణుగూరు వరకు పొడిగించాలని, కాజీపేట్-మణుగూరు ప్యాసింజర్ రైలును తిరిగి కొనసాగించాల్సిందిగా వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు. మధిర రైల్వే స్టేషన్‌ను రూ.25.4 కోట్ల వ్యయంతో "అమృత్ భారత్ స్టేషన్ పథకం" కింద భారీ ఎత్తున నూతన హంగులతో అభివృద్ధి చేస్తున్నారని, ఇక్కడ పలు రైళ్లను ఆపాల్సిన అవసరం ఉందన్నారు. మధిరలో 4వ నంబర్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసి,వృద్ధులు, మహిళలు,చిన్న పిల్లలకు మేలు చేయాలని,పలు రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ ఇవ్వాల్సిందిగా ఎంపీ వద్దిరాజు పలు సూచనలు చేశారు. గౌతమి ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 12737-12738), సికింద్రాబాద్ నుంచి కాకినాడ, పద్మావతి ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 12763), తిరుపతి నుంచి సికింద్రాబాద్ ఈ రైలు తిరుపతి వెళ్తున్నప్పుడు మధిరలో ఆగుతుందని, తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న సమయంలో మధిరలో ఆగడం లేదని,వీటికి తిరిగి హాల్ట్ కల్పించాల్సిందిగా ఎంపీ రవిచంద్ర కోరారు. విశాఖపట్నం నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న సమయంలో మధిరలో ఆగడంలేదని, దీనికి హాల్ట్ కల్పించాలన్నారు. నాందేడ్ నుంచి తిరుచానూరు వరకు తిరుపతి వెళ్లుటకు కలదు (ట్రైన్ నం. 17633-17634). గతంలో ఈ రైలు మధిర రైల్వే స్టేషన్‌లో గతంలో ఆగేదని,ఈ రైలును తిరిగి ఆగే విధంగా తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఎంపీ రవిచంద్ర కోరారు. నాందేడ్ నుంచి ధర్మవరం వెళ్లే (ట్రైన్ నం. 17635-17636). గతంలో మధిరలో ఆగేదని, దీనికి తిరిగి హాల్ట్ కల్పించాల్సిందిగా ఎంపీ వద్దిరాజు రైల్వే అధికారులను కోరారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 17065-17066). నవజీవన్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 12655-12656) రైళ్లకు మధిరలో హాల్టింగ్ ఇవ్వాల్సిందిగా వినతిపత్రంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో న్యూఢిల్లీ వైపు వెళ్లే రైళ్లకు హాల్ట్ కల్పించాలని, ముఖ్యంగా AP ఎక్స్‌ప్రెస్ (20805/06) లేదా GT ఎక్స్‌ప్రెస్ (12516/15) రైళ్లలో ఏదో ఒకదానికి హాల్ట్ ఇవ్వాల్సిందిగా కోరారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పక్కన కొత్తగా రోడ్ ఓవర్ బ్రిడ్జి,రోడ్ అండర్ బ్రిడ్జిలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

గార్ల స్టేషన్‌లో 12713/14 శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్ కల్పించాలని,
కేసముద్రం స్టేషన్‌లో అప్ డైరెక్షన్‌లో
17206 శేషాద్రి ఎక్స్‌ప్రెస్
17208 మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్
17263 పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాల్సిందిగా చెప్పారు.
నెక్కొండ స్టేషన్‌లో అప్ డైరెక్షన్‌లో
12737 గౌతమి ఎక్స్‌ప్రెస్
12763 పద్మావతి ఎక్స్‌ప్రెస్
12705 ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగే విధంగా తగు చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు.

కాజీపేట్-డోర్నకల్-విజయవాడ మార్గంలో ఉదయం వేళల్లో నడిచే డెము ప్యాసింజర్ రైలు 57237/38ను తప్పనిసరిగా పునరుద్ధరించాల్సిందిగా అధికారులను ఆయన డిమాండ్ చేశారు. ప్రతిపాదిత నిజామాబాద్ రైల్వే బైపాస్ లైన్ ఏర్పాటును తిరిగి పరిశీలించాలని, అశోక ఎన్ క్లేవ్ ప్రాజెక్టుకు చెందిన సుమారు 300 ప్లాట్లకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిందిగా,ఈ సమస్య గురించి మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు ఇటీవల వివరించానని,ఎస్సీఆర్ జనరల్ మేనేజర్ శ్రీవాస్తవ దృష్టికి ఎంపీ రవిచంద్ర తెచ్చారు. అలాగే,మధిర సమీపాన ఉన్న దెందుకూరు ట్రాక్ పక్కన భూముల్లో పాతిన రైల్వే హద్దు రాళ్లను తొలగించాలని,అవి రైతులకు చెందిన పట్టా భూములేనని జిల్లా కలెక్టర్ కూడా నిర్ధారించడం జరిగిందని ఎంపీ వద్దిరాజు వివరించారు.

# వ్యసనాలకు దూరంగా.. క్రీడల వైపు యువత అడుగులు..



● **ఎస్‌పీఆర్ పాఠశాలలో సోషల్ వాయిస్ ఫౌండేషన్ నషా ముక్త్ ఛాంపియన్‌షిప్ నిర్వహణ..**
● **నషా ముక్త్ ప్రతిజ్ఞ చేయించిన జేఏసీ కన్వీనర్ కన్నా పరిశరామ్..**
● **వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్‌పీఆర్ పాఠశాల కరస్పాండెంట్ కీర్తి వీరేందర్**

**జనగామ, ఆగస్టు 20, 2026:** యువత, విద్యార్థుల్లో డ్రగ్స్, మద్యం, సిగరెట్, గుట్కా వంటి వ్యసనాలపై అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నషా ముక్త్ ఛాంపియన్‌షిప్ కార్యక్రమాన్ని జనగామలోని ఎస్‌పీఆర్ పాఠశాలలో నిర్వహించారు. సోషల్ వాయిస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జేఏసీ కన్వీనర్ కన్నా పరిశరామ్, డాక్టర్ రంజిత్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి యువత, విద్యార్థులు డ్రగ్స్, మద్యం, సిగరెట్, గుట్కా తదితర వ్యసనాలకు ఆకర్షితులై తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై దృష్టి సారించాలని సూచించారు. యువతలో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

**నషా ముక్త్ ప్రతిజ్ఞ**

ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ కన్నా పరిశరామ్ విద్యార్థులతో నషా ముక్త్ ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్, మద్యం, సిగరెట్, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వ్యసనాలకు దూరంగా ఉండేలా చైతన్యపరుస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

**వ్యసనాలకు దూరంగా ఉండాలి: కీర్తి వీరేందర్**

ఎస్‌పీఆర్ పాఠశాల కరస్పాండెంట్ కీర్తి వీరేందర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను చదివిస్తున్నారని, విద్యార్థులు వ్యసనాల బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎవరైనా వ్యసనాలకు అలవాటు చేయాలని ప్రయత్నించినా వాటికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేలా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.






**క్రీడలతో ఆరోగ్యకరమైన జీవనం**

నషా ముక్త్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ క్రీడా కార్యక్రమాలు, ఆటలు నిర్వహించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా "డ్రగ్స్, మద్యం, సిగరెట్‌కు నో చెప్పండి - క్రీడలు, ఆరోగ్యకరమైన జీవితానికి యెస్ చెప్పండి" అనే సందేశాన్ని విద్యార్థులు, యువతకు అందించారు. వ్యసన రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థి, యువకుడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం క్రీడలు, విద్య వైపు అడుగులు వేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# హెబ్బా పటేల్ చేతుల మీదుగా రెడ్‌మీ నోట్ 17 5జీ విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 20(భవిష్యత్ ప్రజాపాలన):** హైదరాబాద్ లో రెడ్‌మీ నోట్ 17 5జీ స్మార్ట్‌ఫోన్ ఘనంగా లాంచ్ అయింది. సత్యా ఏజెన్సీస్ వాల్యూ జోన్‌లో సినీనటి హెబ్బా పటేల్ ఈ ఫోన్‌ను విడుదల చేశారు. 8 వేల ఎంఏహెచ్ భారీ బ్యాటరీ, 120 హెర్ట్జ్ అమోలెడ్ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 4 ప్రాసెసర్ వంటి అధునాతన ఫీచర్లతో రెడ్‌మీ నోట్ 17 5జీని మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా షావోమీ నిర్వాహకులు సుదీప్ నల్లచెరువు, శ్రీనివాస్ నల్లచెరువు మాట్లాడుతూ.. రెండు వేరియంట్లలో ఫోన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. 6 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర 27 వేల 999 రూపాయలు కాగా.. 8 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజ్ మోడల్ ధర 30 వేల 999 రూపాయలుగా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రారంభ ఆఫర్‌లో భాగంగా ఎస్‌బీఐ, యాక్సిస్, కొటక్ క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసే వారికి 3 వేల రూపాయల వరకు తక్షణ డిస్కౌంట్ లభిస్తుందని తెలిపారు. 6.9 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ ట్రూకలర్ అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 1800 నిట్స్ గరిష్ఠ బ్రైట్‌నెస్‌తో ఫోన్‌ను రూపొందించారు. ఆండ్రాయిడ్ 16 ఆధారిత హైపర్ ఓఎస్ 3పై ఈ స్మార్ట్‌ఫోన్ పనిచేస్తుంది. నాలుగేళ్ల ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్లు, ఆరేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్లు అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఫొటోగ్రఫీ కోసం వెనుకవైపు 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరాతో పాటు సెకండరీ కెమెరా, సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 8 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరాను అందించారు. ఐపీ65 డస్ట్, వాటర్ రెసిస్టెన్స్‌తో పాటు మెరుగైన కూలింగ్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేశారు.



ఈ ఫోన్‌లో ప్రధాన ఆకర్షణ 8 వేల ఎంఏహెచ్ భారీ బ్యాటరీ. 45 వాట్ ఫాస్ట్ ఛార్జింగ్, 22.5 వాట్ రివర్స్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేస్తే దాదాపు రెండున్నర రోజుల పాటు పనిచేస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యా ఏజెన్సీస్ నిర్వాహకులు యూసఫ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# రాపిడో డెలివరీ బాయ్ అదృశ్యం..



**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** రాపిడో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న 26 ఏళ్ల యువకుడు ఇంటి నుంచి విధులకు వెళ్లి అదృశ్యమైన ఘటన బాలాపూర్ పరిధిలో చోటుచేసుకుంది. రెండు రోజులుగా కుమారుడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కుమారుడి ఆచూకీ కనుగొని తమకు అప్పగించాలని తండ్రి మార్కడ్ దత్తాత్రేయ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. రాచకొండ జిల్లా, బాలాపూర్ మండలం, జల్పల్లి గ్రామంలోని నిత్య ఎన్‌క్లేవ్‌కు చెందిన మార్కడ్ దత్తాత్రేయ వృత్తిరీత్యా టైలర్‌గా పనిచేస్తున్నారు. ఆయన పెద్ద కుమారుడు మార్కడ్ అజయ్ (26) గత కొన్ని నెలలుగా రాపిడో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే ఈ నెల 18న ఉదయం సుమారు 6.30 గంటలకు విధులకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి తన యాక్టివా ద్విచక్ర వాహనం నంబర్ TS07H=1174పై ఇంటి నుంచి బయలుదేరాడు. ఇంటి నుంచి బయలుదేరే సమయంలో తన భార్య అశ్వినికి రాత్రి 12 గంటలలోపు ఇంటికి తిరిగి వస్తానని అజయ్ చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే రాత్రి 12 గంటలు దాటినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. మరుసటి రోజు సాయంత్రం 6 గంటల వరకు కూడా అజయ్ ఇంటికి చేరుకోకపోవడంతో తండ్రి దత్తాత్రేయ తన కుమారుడి మొబైల్ నంబర్ 8074815186కు పలుమార్లు ఫోన్ చేశారు. తొలుత ఫోన్‌కు స్పందించకపోగా, అనంతరం మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కుటుంబ సభ్యులు అజయ్ కోసం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. బంధువులు, స్నేహితులు, పరిచయస్తులను సంప్రదించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో ఆందోళన చెందిన తండ్రి గురువారం ఆగస్టు 20న సాయంత్రం 4 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడి ఆచూకీ కనుగొని, అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అదృశ్యమైన యువకుడి వివరాలు: మార్కడ్ అజయ్ వయసు 26 సంవత్సరాలు. తెల్లటి వర్ణం, అండాకార ముఖం, సుమారు 6 అడుగుల ఎత్తు కలిగి ఉంటాడు. తెలుగు, హిందీ, మరాఠీ భాషలు మాట్లాడగలడు. ఇంటి నుంచి బయలుదేరే సమయంలో ఆకుపచ్చ రంగు షర్టు, తెలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అతని వద్ద ఉన్న యాక్టివా వాహనం నంబర్ TS07H=1174గా కుటుంబ సభ్యులు తెలిపారు.

**"కుమారుడి ఆచూకీ కోసం కుటుంబం ఎదురుచూపులు"**

రెండు రోజులుగా కుమారుడి జాడ తెలియకపోవడంతో మార్కడ్ దత్తాత్రేయ కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉంది. ఎక్కడ ఉన్నాడో, ఏ పరిస్థితిలో ఉన్నాడో తెలియక కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అజయ్ ఆచూకీ కోసం అవసరమైన చర్యలు చేపట్టి, త్వరగా తమ కుమారుడిని క్షేమంగా ఇంటికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. "ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోతే ప్రతి నిమిషం కుటుంబానికి ఆందోళనే.. ఆచూకీ లభించే వరకు గాలింపు కొనసాగాలి" అన్నట్టుగా అజయ్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదు ఆధారంగా అదృశ్యమైన యువకుడి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**●దేశాన్ని ఆధునిక ప్రగతి వైపు నడిపిన దార్శనిక నాయకుడు**

**●మహేశ్వరం నియోజకవర్గంలో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు**



**రంగారెడ్డి జిల్లా,మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మీర్‌పేట్, ప్రశాంత్ హిల్స్, ఎన్‌టీఆర్ నగర్ డివిజన్లలో నిర్వహించిన జయంతి కార్యక్రమాల్లో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి, కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన దార్శనిక నాయకుడని కొనియాడారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు, సాంకేతికతను దేశ అభివృద్ధికి అనుసంధానం చేసి ఆధునిక భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. "దేశ భవిష్యత్తును యువత చేతుల్లో పెట్టి, సాంకేతిక భారతానికి బాటలు వేసిన మహానేత రాజీవ్ గాంధీ. ఆయన ఆలోచనలు, ఆశయాలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకం. దేశ ప్రగతి కోసం ఆయన చేసిన సేవలను భారత ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు" అని దేప భాస్కర్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఆయన చూపిన అభివృద్ధి, ఆధునికత, యువశక్తి మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, జిల్లా నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు.

## ఆటో క్యాబ్ వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఆటో యాప్ ఆధారిత సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది




ఆటో క్యాబ్ వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఆటో యాప్ ఆధారిత సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది గురువారం నాడు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ, బి ఎం ఎస్, బి ఆర్ టి యు, సిఐటియు, ఐ ఎన్ టి యు సి, టి యు సి ఐ, ఐ ఎఫ్ టి యు, టి ఎన్ టి యు సి ,టి ఆర్ టి యు , టి ఏ డి ఎస్, టి ఏ డి యు, ఐఎఫ్టియు, జి యు టి ఎస్, టీఎం, డి యు, జి హెచ్ ఏ టి డి యు, టి టి డబ్ల్యూ, సిటీ ఆటో యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రెస్మీట్ నిర్వహించారు ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యానికి ఇవి ఆటోలను ఇవ్వాలని ప్రతి ఇవ్వాలని ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని కోరారు ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు కోరారు పెరిగిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ల చార్జి పెంచాలని వారు డిమాండ్ చేశారు ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12000 ఇవ్వాలని రోజువారి ప్రజలకు సౌకర్యం కల్పించే ఆటో డ్రైవర్లకు ఈ ఛానల్ నుంచి మినహాయించాలని జీవో నెంబర్ 263 లోని మిగిలిన ఆటలను వెంటనే ఇవ్వాలని వారు కోరారు హైదరాబాద్ నగరంలో సత్కర్మ నడుస్తున్న ఇతర జిల్లాల ఆటోలు నిషేధించాలి ఇతర సారథి పోర్టల్‌లో ఆటో డ్రైవర్ల లైసెన్స్ కొనసాగించాలని రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్లు జీవో ఎంఎస్ నెంబర్ 60లో ఆటలను వినియోగించాలని ఆక్సిడెంట్లకు బీమా కొనసాగించాలని సాధారణ మరణాలకు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు 60 సంవత్సరాలు పూర్తయిన వారికి పెన్షన్ ఇవ్వాలని ఆత్మహత్య చేసుకున్న వారిని ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# బోనాల సందర్భంగా జర్నలిస్టులకు ఘన సన్మానం

**●ఉప్పల్ శ్రీ మహంకాళి దేవస్థానం చైర్మన్ తెల్కల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం**



**ఉప్పల్,ఆగష్టు 20(భవిష్యత్తు ప్రజాపాలన):** బోనాల పండుగను పురస్కరించుకుని ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ మిత్రులకు ఉప్పల్ శ్రీ మహంకాళి దేవస్థానం చైర్మన్ తెల్కల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గురు వారం ఘనంగా సన్మానం చేశారు. జర్నలిస్టు లకు శాలువాలు కప్పి సత్కరించి, బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంద ర్భంగా తెల్కల మోహన్‌రెడ్డి మాట్లా డుతూ.. ప్రజలకు,సమాజానికి సమాచారాన్ని చేర వేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలక మని,ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు రావడంలో మీడియా చేస్తున్న కృషి అభినంద నీయమని అన్నారు. ఈ కార్య క్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు ఇడపాక సురేష్,బోడ ప్రవీణ్,కదుకూరి ప్రశాంత్, సంస్కృతిక కార్యదర్శి షేక్ యాకుబ్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీలు,నెమ్మదివెంకన్న, దేవాతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలతో ఆధునిక భారత నిర్మాణం

**●బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం వద్ద ఘనంగా జయంతి వేడుకలు**



**రంగారెడ్డి జిల్లా,బడంగ్‌పేట్:** మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ యువతకు స్ఫూర్తిగా నిలిచిన రాజీవ్ గాంధీ ఆధునిక భారత నిర్మాణానికి విశేష కృషి చేశారని కొనియాడారు. భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలనే దూరదృష్టితో ఆయన అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ముఖ్యంగా సాంకేతిక, సమాచార రంగాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రగతికి బలమైన పునాదులు వేశాయని పేర్కొన్నారు. "యువశక్తికి దిశానిర్దేశం చేసి.. ఆధునిక భారతానికి బాటలు వేసిన దార్శనికుడు రాజీవ్ గాంధీ" అని నాయకులు కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అభివృద్ధి ఫలాలు అందాలన్నదే ఆయన ఆకాంక్షగా ఉండేదని, దేశ ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను తరతరాలు గుర్తుంచుకుంటాయని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడం, సాంకేతికతను ప్రజలకు చేరువ చేయడం వంటి అంశాల్లో రాజీవ్ గాంధీ ఆలోచనలు నేటికీ ఎంతో ప్రాసంగికంగా ఉన్నాయని తెలిపారు.

**పలువురు నాయకుల పాల్గొనడం**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, ఎలిమినేటి అమరేందర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి హాజరై రాజీవ్ గాంధీకి నివాళులర్పించారు. అలాగే డివిజన్ అధ్యక్షులు బంగారి అశోక్, శ్రీరాములు, యూత్ అధ్యక్షులు సుభాన్ యాదవ్, పర్వత్ రవికాంత్ రెడ్డి, నవారి మల్లారెడ్డి, పుట్టగల జగన్, కృష్ణ రాజుగౌడ్, డి. శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, రామిడి శ్రీనివాస్ రెడ్డి, రామిడి దిలీప్ రెడ్డి, వంశీచారి, ఒంగేటి మధుసూదన్ రెడ్డి, అమృత నాయుడు, లక్ష్మీనరసింహ, చంద్రపాల్ రెడ్డి, శ్రీరాములు తిరుమలేష్, మణి, శివకుమార్, గిరిధర్, మల్‌గారి శ్రీకాంత్ రెడ్డి, నవారు ప్రభాకర్ రెడ్డి, సం రెడ్డి హేమంత్ రెడ్డి, పుట్టగల భాస్కర్, దిండు వెంకటేష్ గౌడ్, మద్రి చంద్రశేఖర్, పగడాల ఉమేష్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్, 57 నాదర్గుల్ డివిజన్ అధ్యక్షులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ చూపిన అభివృద్ధి బాటలో ముందుకు సాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. యువతకు మెరుగైన భవిష్యత్ అందించడమే రాజీవ్ గాంధీకి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. "రాజీవ్ గాంధీ ఆశయాలు.. యువతకు మార్గదర్శకాలు. ఆయన కలలుగన్న ఆధునిక భారతాన్ని నిర్మించడమే మనందరి బాధ్యత" అని గోవర్ధన్ రెడ్డి అన్నారు.

# ఫిలిప్పీన్స్ విదేశాంగ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ బృందం



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 20:** ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలా లోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యుల బృందం గురువారం సందర్శించింది. విదేశాంగ శాఖ అధికారులతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపింది. ఫిలిప్పీన్స్ దేశం విదేశాలలో పనిచేసే ప్రవాసుల కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను అత్యుత్తమ విధానాలను తెలంగాణ బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బృందానికి సారథ్యం వహిస్తున్న కమిటీ ఛైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి గల్ఫ్ కార్మికులకు ఎలా అండగా ఉండాలి అన్న అంశాలపై ఫిలిప్పీన్స్ అధికారులతో విపులంగా చర్చించారు. ఫిలిప్పీన్స్ దేశంలో అమలు చేస్తున్న వలస కార్మికుల విధానాన్ని, తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో నివాసం ఉంటున్న సుమారు 15 లక్షల మంది కార్మికులకు అండగా ఉండేందుకు త్వరలో ఒక విధానాన్ని రూపొందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్, డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. ఫిలిప్పీన్స్ దేశ పర్యటనలో భారత విదేశాంగ శాఖ ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ ఈ బృందానికి సంపూర్ణ సహకారాన్ని అందించారు.



# బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో



బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ కులంలోని అన్ని వర్గాల వారికి ఎస్సీ ఎస్టీ వారికి మాదిరిగానే కులాలకు బీసీలు గ్రేడ్లను గుర్తించాలని రాజ్యసభ సభ్యులు పీ విల్సన్ డిమాండ్ చేశారు హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 20 : గురువారం నాడు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ వర్గాలను గుర్తించి వారి ఐక్యత కోసం పాటుపడాలని కోరారు బీసీ వర్గాలకు రాజ్యాధికార కోసం అన్ని వర్గాల ప్రజలు కృత్యాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి బిసి వర్గంలోని అన్ని వర్గాలను గుర్తించి ఎస్సీల మాదిరిగానే బీసీలకు కూడా గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు మాజీ డిజిపి జే పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీల ఐక్యత కోసం అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని కోరారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల అభ్యున్నతి కోసం కృషి చేయాలని ఆయన కోరారు బిసి బిసి ఐక్యవేదిక చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారిటి చిరంజీవులు మాట్లాడుతూ బీసీల ఐక్యత కోసం అందరూ కృషి చేయాలని కోరారు బీసీ వర్గాలంతా ఏకమైతే రాజ్యాధికారం సిద్ధిస్తుందని ఆయన అన్నారు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలంతా ఒక్కటి కావాల్సిన అవసరం ఉందని అందుకోసం అందరూ కృషి చేయాలని ఆయన కోరారు ఏ ఒక్కరితో రాజ్యాధికారం రాదని అందరు కృషి చేసినప్పుడే ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొని బీసీల ఐక్యత కోసం కృషి చేయాలని కోరారు.

## కోవిడ్ 19 తగ్గిన తరువాత కూడా ఇన్‌ఫెక్షన్ శరీరంలో చాలా కాలంగా ఉంటుందా.

**అధ్యయనంలో ఏం తేలింది..??**




కోవిడ్-19 తర్వాత కొంతమందిలో నెలలు లేదా సంవత్సరాల పాటు కొనసాగే లక్షణాలకు కారణాలపై శాస్త్రవేత్తలు మరింత లోతుగా పరిశోధిస్తున్నారు. తాజాగా యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాన్‌ఫ్రాన్సిస్కో (యూసీఎస్ఎఫ్) పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో లాంగ్ కోవిడ్ ఉన్నవారి పేగు కణజాలంలో రోగనిరోధక వ్యవస్థకు సంబంధించిన అనేక అసాధారణ మార్పులు కనిపించాయి. వైరస్ అవశేషాలను తొలగించేందుకు శరీరం ప్రయత్నిస్తూనే ఉన్నప్పటికీ, అదే సమయంలో వాపును పెంచే ప్రక్రియలు కొనసాగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. లాంగ్ కోవిడ్ ఉన్నవారిలో రోగనిరోధక వ్యవస్థ దీర్ఘకాలంగా కరోనావైరస్ అవశేషాలతో పోరాడుతున్న పరిస్థితిలో ఉంటుందని ఈ పరిశోధన సూచిస్తోంది. శరీరంలోని తొలి రక్షణ వ్యవస్థల్లో కొన్ని ఇన్ఫెక్షన్లు తగ్గిన చాలా కాలం తర్వాత కూడా క్రియాశీలంగా ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు, వైరస్ ఉన్న కణాలను గుర్తించి నాశనం చేయాల్సిన కొన్ని రోగనిరోధక ప్రక్రియలు బలహీనపడినట్లు తేలింది. దీంతో శరీరంలో వాపు కొనసాగుతున్నప్పటికీ, దానికి కారణమయ్యే వైరస్ అవశేషాలను సమర్థంగా తొలగించే సామర్థ్యం తగ్గిన పరిస్థితి ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు.

# మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు

**●పెద్ద అంబర్‌పేట్ అనాథాశ్రమంలో ఘనంగా వేడుకలు.. మొక్కలు నాటి, చిన్నారులకు భోజనం.. కేక్ కట్ చేసిన అభిమానులు**

**రంగారెడ్డి జిల్లా,మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర చిరంజీవి, పవన్ కళ్యాణ్ అభిమానుల ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్‌లోని అనాథాశ్రమంలో ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథాశ్రమంలోని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అనాథాశ్రమం ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం చిన్నారులకు భోజనం ఏర్పాటు చేసి అభిమానులు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. అభిమానుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర చిరంజీవి ఫ్యాన్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సతీష్ యాకుత్ పురా ఇంచార్జ్ నేనావత్ సీతారాం నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. అలాగే జన్ని, నరేందర్ రెడ్డి, నరసింహ, విఘ్నేష్, డాక్టర్ సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులకు భోజనం అందించడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే విధంగా వేడుకలు నిర్వహించామని తెలిపారు. భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని పేర్కొన్నారు.



# తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసిన దొంగ..
# శంకర్‌పల్లి పోలీసుల చేతికి చిక్కిన నిందితుడు

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి శంకర్‌పల్లి ఆగస్టు 20 చేవెళ్ల నియోజకవర్గం:** శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి యత్నించిన వేముల నర్సింహ అలియాస్ చిమకాండ్ల నర్సింహ (36)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఫతేనగర్‌లోని ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన నిందితుడు పెయింటర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలోనూ దొంగతనం కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లిన అతను ఇటీవల 04.08.2026న జైలు నుంచి విడుదలయ్యాడు. అనంతరం మద్యం సేవించడం, వ్యక్తిగత ఖర్చుల కోసం డబ్బు అవసరం కావడంతో తిరిగి దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. నగర ప్రాంతంలో దొంగతనం చేస్తే సులభంగా పట్టుబడే అవకాశం ఉందని భావించి శంకర్‌పల్లిని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో 19.08.2026 ఉదయం సనత్‌నగర్ నుంచి రైలులో శంకర్‌పల్లి చేరుకున్న నిందితుడు, అనంతరం వివిధ ప్రాంతాల్లో



తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గమనించాడు. సాయంత్రం సమయంలో ఓ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి, చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకుని ఇనుప రాడ్‌తో తాళం పగులగొట్టేందుకు ప్రయత్నించాడు. తాళం పగులగొడుతున్న సమయంలో వచ్చిన శబ్దాన్ని గుర్తించిన కాలనీ వాసులు అక్కడికి చేరుకుని నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడి వద్ద నుంచి దొంగతనానికి ఉపయోగించిన సుమారు ఒక అడుగు పొడవు, ఒక సెంటీమీటర్ వెడల్పు గల ఇనుప రాడ్‌తో పాటు మొబైల్‌ఫోన్‌ను పోలీసులు పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు దొంగతనం కేసుల వివరాలు కూడా విచారణలో వెలుగులోకి వచ్చాయి. నిందితుడిని అరెస్ట్ చేసి చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టగా, కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# చెట్టు కనిపిస్తే చాలు.. మొక్క నాటాల్సిందే

**●పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్న భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్**

**●ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపించినా మొక్కలు నాటుతూ పచ్చదనం కోసం నిరంతర కృషి**



**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** పర్యావరణ పరిరక్షణను తన జీవిత లక్ష్యంగా చేసుకుని, ఎక్కడ చెట్టు కనిపించినా దాని సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ.. ఖాళీ ప్రదేశం కనిపిస్తే అక్కడ మొక్కలు నాటుతూ పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తున్న పర్యావరణ ప్రేమికుడు, హ్యాపీ భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. "మన కోసం ప్రకృతి ఎన్నో ఇచ్చింది.. భవిష్యత్ తరాల కోసం మనం చెట్లను అందించాలి" అనే సందేశంతో దూదుచౌహాన్ మొక్కలు నాటే కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. మొక్క నాటడమే కాకుండా వాటి సంరక్షణ, పెంపకం కూడా ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తూ ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నారు. నగరాలు విస్తరిస్తున్న కొద్దీ పచ్చదనం తగ్గిపోతుండటంతో వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని చెట్టుగా పెంచాలని దూదుచౌహాన్ సూచిస్తున్నారు. "ఒక మొక్క నాటడం చిన్న పని కావచ్చు.. కానీ అది చెట్టుగా మారినప్పుడు సమాజానికి చేసే సేవ ఎంతో గొప్పది" అని ఆయన పేర్కొన్నారు. భగవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, పచ్చదనం విస్తరణ వంటి కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెట్టు నాటడం ఒకరోజు కార్యక్రమం కాదు.. భవిష్యత్ తరాల కోసం మనం చేసే శాశ్వత పెట్టుబడి అని పేర్కొంటూ దూదుచౌహాన్ చేస్తున్న పర్యావరణ సేవలను పలువురు అభినందిస్తున్నారు.

# తప్పిపోయిన వృద్ధ మహిళను కుటుంబ సభ్యులకు
# అప్పగించిన చిలకలగూడ పోలీసులు

**సికింద్రాబాద్, ఆగస్టు 20 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** జూలై 17న గుర్తించిన ఓ వృద్ధ మహిళ కుటుంబ వివరాలను తెలుసుకుని, ఆమె కుటుంబ సభ్యులను గుర్తించి అప్పగించేందుకు చిలకలగూడ పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఎస్‌హెచ్‌ఓ రామకృష్ణ సూచనల మేరకు ఆమె సంరక్షణ, భద్రత కోసం మిషనరీస్ ఆఫ్ ఛారిటీ హోమ్‌లో చేర్పించారు. ఆగస్టు 20న కుందన్‌బాయ్ కుమారులు ప్రదీప్‌కుమార్, దీపక్‌కుమార్, సందీప్‌కుమార్ కాచిగూడ నింబోలి అడ్డా నుంచి చిలకలగూడ పోలీస్ స్టేషన్‌కు వచ్చి కానిస్టేబుల్ పి. శ్రీనివాస్‌ను కలిసి తమ తల్లి ఆచూకీ గురించి విచారించారు. శ్రీనివాస్ ఆమెను గుర్తించి, మిషనరీస్ ఆఫ్ ఛారిటీ హోమ్‌లో ఉన్నట్లు వారికి తెలియజేశారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ




సమక్షంలో వృద్ధ మహిళను ఆమె కుమారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పోలీసుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

**సికింద్రాబాద్, ఆగస్టు 20 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 89వ జయంతిని పురస్కరించుకొని బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని న్యూ బోయగూడ ఐడీహెచ్ కాలనీలో గురువారం ఘనంగా వేడుకలను ఆయన జ్ఞాపకాలతో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడీహెచ్ కాలనీలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.ఎం. రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు జి.ఎల్. రమేష్‌బాబు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, సాంకేతిక రంగాల్లో భారత్ నేడు సాధిస్తున్న ప్రగతికి రాజీవ్‌గాంధీ ముందుచూపు, దూరదృష్టి ఎంతో దోహదపడిందన్నారు. దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించడంలో ఆయన పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు





రాజీవ్‌గాంధీకి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి.శ్రీనివాస్, వి.ఎస్.నారాయణ, పాండుగౌడ్, ఐత. చిరంజీవి, ఎంపీ సునీల్, పార్సీ మహేష్, వేదప్రకాష్ యాదవ్, సాయి సందీప్, సునీల్, రాజశేఖర్, విజయ్‌కుమార్, హరి, శివయాదవ్, దుర్గేష్, సీ.పీ శంకర్, అభిషేక్, శ్యామ్‌రావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ప్రారంభమైన హిమ్‌టెక్స్ 2026






**హైదరాబాద్, ఆగస్టు 20(భవిష్యత్ ప్రజాపాలన):** హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 9వ ఎడిషన్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ మెషిన్ టూల్ అండ్







ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్.. హిమ్‌టెక్స్ 2026 ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనను ఏస్ అర్బన్ గ్రూప్ అండ్ ఏఎం గ్రీన్ డైరెక్టర్ స్వాతి చలమలశెట్టి, ఎంఎస్ఎంఈ డీఎఫ్ఓ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ రాజేష్ కుమార్ యాదవ్ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా తయారీ, ఇంజినీరింగ్ రంగాలకు చెందిన సుమారు 300 సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. మెషిన్ టూల్స్, రోబోటిక్స్, ఇంజినీరింగ్ సొల్యూషన్స్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వంటి రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా స్వాతి చలమలశెట్టి మాట్లాడుతూ.. ఆటోమేషన్, డిజిటలైజేషన్, అధునాతన ఇంజినీరింగ్ టెక్నాలజీలతో తయారీ రంగం కీలక మార్పుల దిశగా సాగుతోందన్నారు. ఆధునిక సాంకేతికతలను భారతీయ పరిశ్రమలకు చేరువ చేయడంతో పాటు.. సంస్థలు తమ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక పరిష్కారాలను అన్వేషించేందుకు హిమ్‌టెక్స్ కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు. హైటెక్స్ డైరెక్టర్ కున శంకర్ మాట్లాడుతూ.. హిమ్‌టెక్స్ దేశంలోని ప్రముఖ పారిశ్రామిక ప్రదర్శనల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల్లో తయారీ రంగ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రదర్శనలో సీఎన్‌సీ యంత్రాలు, మ్యాచినింగ్ సెంటర్లు, లేథ్‌లు, డ్రిల్లింగ్, మిల్లింగ్, గ్రైండింగ్ యంత్రాలు, మెటల్ ఫార్మింగ్ మెషీన్లు, ఇండస్ట్రియల్ రోబోట్స్, కటింగ్ మెషీన్లు, వెల్డింగ్ పరికరాలు, హైడ్రాలిక్, న్యూమాటిక్ టూల్స్‌తో పాటు కొలతలు, పరీక్షలు, ఆటోమేషన్‌కు సంబంధించిన ఆధునిక పరికరాలను ప్రదర్శిస్తున్నారు. తయారీ, ఇంజినీరింగ్ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, నాలెడ్జ్ షేరింగ్, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంచడంతో పాటు.. స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ వైపు పరిశ్రమలను నడిపించడమే హిమ్‌టెక్స్ 2026 ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.

# ఐదేళ్లకోసారి వచ్చే అపురూపం.. బోత్యా తండాలో మొలకల జాతర!






**●తీజ్ అంటేనే తీయని సంబురం.. పెళ్లికాని అమ్మాయిల పవిత్ర పండుగకు వేళాయె!**

**●చేతిలో మొలకలు.. మదిలో మొక్కులు.. పాలు గ్రామంలో ఘనంగా తీజ్ వేడుకలు**

**చింతపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్ద్య:** నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం లోని గ్రామపంచాయతీ పరిధిలోని బోత్యా తండాలో తీజ్ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. బంజారా గిరిజనుల అత్యంత పవిత్రమైన పండుగ అయిన తీజ్ ను ఈ తండాలో 5 సంవత్సరాలకు ఒకసారి అత్యంత ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ 9 రోజుల పాటు పెళ్లికాని యువతులు ఎంతో నిష్టతో, పవిత్రంగా జరుపుకునే ఈ పండుగను మొలకల పండుగ అని కూడా పిలుస్తారు. ఈ పండుగ కోసం చిన్నారుల నుండి వృద్ధుల వరకు స్కూల్లు, కాలేజీలకు సెలవు పెట్టి మరీ తండాకు చేరుకుంటారు. గోధుమలతో మొలకలను పెంచి, చేతిలో పట్టుకొని ఆడపడుచులు చేసే ప్రత్యేక పూజలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మీరు దృశ్యాల్లో చూస్తున్నట్టుగా వయసు మళ్లిన అవ్వలు సైతం సంప్రదాయ దుస్తుల్లో, చేతిలో మొలకల బుట్టలతో పండుగలో పాల్గొని సందడి చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా తండా అంతా ఒకే కుటుంబంలా కలిసి ఈ వేడుకను జరుపుకోవడం విశేషం. బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ తీజ్ పండుగ, వారి ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది.

# ప్రీడయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేసే మంచి బ్యాక్టీరియా.. ఏం చేస్తే పొందవచ్చు..?



భారత్‌లో ప్రీడయాబెటిస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతోపాటు పేగు ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న వయసులోనే ప్రీడయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించేందుకు ఆహారం, శారీరక చురుకుదనం, నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటి జీవనశైలి మార్పులు కీలకంగా మారుతున్నాయి. పేగుల్లోని సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతింటే ఇన్సులిన్ నిరోధకత, గ్లూకోజ్ నియంత్రణలో సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రీడయాబెటిస్ అంటే రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, డయాబెటిస్ స్థాయికి ఇంకా చేరని పరిస్థితి. ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్ 100-125 mg/dL మధ్య ఉండటం, భోజనం తర్వాత రెండు గంటల రక్తంలో గ్లూకోజ్ 140-199 mg/dL మధ్య ఉండటం లేదా HbA1c 5.7-6.4 శాతం మధ్య ఉండటం ప్రీడయాబెటిస్‌కు సూచనలుగా పరిగణిస్తారు. చిన్న వయసులోనే ప్రీడయాబెటిస్ రావడానికి అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, జీవక్రియలో మార్పులు, ఇతర పర్యావరణ కారణాలు దోహదం చేస్తాయని అంటున్నారు.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం!

**దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాప్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 20. :

కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి

32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది



మహాబలిపురం: హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాప్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 20: కేంద్ర–రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు. సమస్యలు రాష్ట్ర సరిహద్దులను ప్రభుత్వ ఫైళ్ల కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్–II పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన ప్రక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు– రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు––రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడా నికి కేంద్రం సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందన్నారు. షెడ్యూల్–IXలోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్–X సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధ్రప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేదని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన ప్రక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా–లాజిస్టిక్స్, ఆర్థిక పోటీతత్వం వంటి అంశాలు రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని అన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పోటీ పడుతూనే పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తదుపరి 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని ఆకాంక్షించారు. ట్రిబ్యునల్ లేకుండా, కమిటీ లేకుండా, బహుశా మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా లేకుండా సమస్యలు పరిష్కారం కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరయ్యే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి ముందు కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కేరళ సీఎం శ్రీ వి డి సతీష్ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సమావేశంలో పాల్గొన్నారు ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కర్ణాటక హోమ్ మంత్రి ప్రియాంక ఖర్గే పాల్గొన్నారు.

# సలీమ్ పాషా కుటుంబాన్ని పరామర్శించిన సబితా ఇంద్రారెడ్డి




**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి శంకర్‌పల్లి చేవెళ్ల నియోజకవర్గం :** టీయూడబ్ల్యూజే (ఐఖెజే) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా, శంకర్‌పల్లి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఎండీ జీలానీ పాషాల మాతృమూర్తి మస్తాన్ బీ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గురువారం శంకర్‌పల్లిలోని సలీమ్ పాషా నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మస్తాన్ బీ చిత్రపటానికి నివాళులర్పించిన సబితా ఇంద్రారెడ్డి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాతృమూర్తిని కోల్పోవడం బాధాకరమని, కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేశమొల్ల ఆంజనేయులు, బద్దం శశిధర్ రెడ్డి, కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఎం. చిన్న నర్సింలు, మాణిక్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, యాదగిరి, వాసుదేవ్ కన్నా, సుధాకర్ రెడ్డి, లింగారెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకం




**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి శంకర్‌పల్లి ఆగస్టు 20 చేవెళ్ల నియోజకవర్గం:** భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని శంకర్‌పల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్ర మౌళి, శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ చేకూర్తి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరు సీనియర్ టంగుటూరు సీనియంనాయకులు బద్దం కృష్ణారెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ అభివృద్ధి, సాంకేతిక ప్రగతి, యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ సర్పంచులు, మున్సిపల్, మండల కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాచారం ప్రభుత్వ పాఠశాల వద్ద మృత్యువు ఉచ్చులా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్!



- **250 మంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం**
- **గేటు పక్కనే ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్**
- **భారీ శబ్దాలు, మెరుపులు, మంటలతో భయాందోళన**
- **వర్షాకాలంలో మరింత ముప్పు.. తక్షణ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్**
- **ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా అధికారులు స్పందించాలి**

**ఉప్పల్,ఆగస్టు20(భవిష్యత్తు ప్రజాపాలన):** నాచారం ప్రభుత్వ పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన చిన్నారులు చదువుకునే ఈ పాఠశాల ప్రధాన గేటు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతిరోజూ విద్యార్థులు అదే మార్గంలో రాకపోకలు సాగిస్తుండటంతో పాటు పాఠశాల ప్రాంగణంలో ఆడుకునే పరిస్థితి ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**గేటు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్.. భద్రత ప్రశ్నార్థకం**

పాఠశాల ప్రధాన గేటుకు సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. చిన్నారులు ఆ ప్రాంతంలో సంచరించే సమయంలో తగిన భద్రతా చర్యలు లేకపోతే ప్రమాదానికి అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**శబ్దాలు, మెరుపులు, మంటలతో భయం**

విద్యుత్ హెచ్చుతగ్గులు ఏర్పడిన సందర్భాల్లో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద శబ్దాలు, మెరుపులు, మంటలు కనిపిస్తున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఇలాంటి ఘటనలతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు.

**వర్షాకాలంలో మరింత అప్రమత్తత అవసరం**

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యుత్ పరికరాల వద్ద అదనపు భద్రతా చర్యలు అవసరమని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రాంతంలో విద్యుత్ భద్రతకు సంబంధించి ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే గుర్తించి సరిదిద్దాలని కోరుతున్నారు.

**విద్యుత్ శాఖతో పాటు విద్యాశాఖ స్పందించాలి**

ఈ సమస్యను విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించి విద్యుత్ శాఖతో పాటు విద్యాశాఖ అధికారులు కూడా స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు పాఠశాలను సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రమాదం జరిగిన తర్వాత కాదు.. ముందే చర్యలు తీసుకోవాలి**

"విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్‌ను సాంకేతికంగా పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలి. విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలి" అని తల్లిదండ్రులు కోరుతున్నారు. 250 మంది చిన్నారులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో ప్రమాదం చోటుచేసుకునే వరకు అధికారులు వేచి చూడకుండా విద్యుత్ శాఖ, విద్యాశాఖ, సంబంధిత అధికారులు సమన్వయంతో తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.




# విద్యార్థులే దేశ భవిష్యత్తు.. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- **కొత్తబస్తీలో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు**

**సికింద్రాబాద్, ఆగస్టు 20 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** భారత మాజీ ప్రధాని, దేశంలో ఆధునిక సాంకేతిక రంగానికి పునాదులు వేసిన దివంగత రాజీవ్ గాంధీ 89వ జయంతి వేడుకలను సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మెట్టుగూడ డివిజన్ కొత్తబస్తీలో ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆడం సంతోష్ కుమార్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ర్యాల రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రాజీవ్ గాంధీకి ఘన నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... యువత, విద్యార్థులే దేశ భవిష్యత్తు అని విశ్వసించిన రాజీవ్ గాంధీ విద్య, సాంకేతిక రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని దేశ



అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పృధ్వీరాజ్, గడ్డం మహి, అంజయ్య, రమేష్, నగేష్, గోవింద్, రాజన్, మహిళా నాయకులు రూత్ క్లారి, సంతోషి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి జోన్‌లో కార్యాలయ మౌలిక సదుపాయాల బలోపేతం!



- **సృజన IAS కమిషనర్ సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**

**శేరిలింగంపల్లి :** జోన్‌లో కార్యాలయ పరిపాలనను బలోపేతం చేయడానికి మరియు ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందించడానికి ఒక కీలక అడుగు పడింది.

జిఎంసి (CMC) కమిషనర్, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో పలు కీలక వసతులు, నూతన విభాగాలను ప్రారంభించడంతో పాటు క్షేత్రస్థాయి సేవల కోసం నూతన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

**ప్రారంభించిన వసతులు మరియు కార్యక్రమాలు:**

- జోనల్ ఆఫీస్ లాబీ (Lobby)
- డిప్యూటీ కమిషనర్ కార్యాలయం – శేరిలింగంపల్లి సర్కిల్
- 150 అడుగుల జాతీయ జెండా
- ఆడిటోరియం
- శానిటేషన్ (పారిశుధ్య) విభాగం కార్యాలయం
- ఎస్‌డబ్ల్యూఎమ్ (ఘన వ్యర్థాల నిర్వహణ) విభాగం కార్యాలయం
- ఆరోగ్య (Health) విభాగం కార్యాలయం
- ఆఫీస్ పార్కులు

ఈ నూతన వసతులు, అత్యాధునిక యంత్రాలు క్షేత్రస్థాయి పనులను మరింత వేగవంతం చేస్తాయని అధికారులు తెలిపారు. ఇవి శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు మరింత సమర్థవంతంగా, వేగంగా పౌర సేవలను అందించడానికి మరియు కార్పొరేషన్




పనితీరును మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడతాయి అని కమిషనర్ సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ జి. సృజన ఐఏఎస్ తెలిపారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జోనల్ అధికారులు మరియు సిబంది అందరూ ఉత్సాహంగా పాల్గొనారు.

# కల్యాణ లక్ష్మి పథకంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- కెసిఆర్ అమలు చేసిన పథకాలను కొనసాగించాలి
- ప్రశ్నించకపోతే సంక్షేమ పథకాలను రద్దు చేస్తారు
- పేద ప్రజల నోట్లో మట్టి కొడతారా
- తులం బంగారం ఇవ్వకపాయే...!ఉన్న కళ్యాణ లక్ష్మి లేకుండా పాయే..!!
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి పట్టిన దరిద్రం
- ఒంటి పైన ఖాకి డ్రెస్సు మనసు అంతా కాంగ్రెస్సు
- బీఆర్ఎస్ పార్టీ మహాధర్నాలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి






**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయని ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రజల ముందుకు వచ్చి ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల రద్దులో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత రాహిత్యం,అలసత్వాన్ని నిరసిస్తూ మినీ ట్యాంక్ బండ్ కూడలిలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కానీ ఎన్నో పథకాలను ప్రకటించి ప్రజల నుంచి ఓట్లు వేసుకొని అధికారం లోకి వచ్చాక కొత్త పథకాలు అమలు చేసుడు పక్కనపెట్టి ఉన్న పథకాలకు మంగళం పాడుతున్నారని ఆయన ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించకపోవడం నిర్లక్ష్యంగా వహించడం వల్ల నేడు ఈ పథకం రద్దు వరకు వచ్చిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి న్యాయవాదులను నియమించి ఉంటే ఇలాంటి పరిస్థితులు వచ్చేవి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో స్పందించి పెద్దింటి ఆడపిల్లల సంక్షేమం కోరి కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి పథకాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ప్రజల అవసరాలను గుర్తించి బాధ్యతగా ఓ ఇంటికి పెద్దన్నగా ప్రతి కుటుంబానికి ఒక పథకాన్ని అందించి ఆదుకున్న గొప్ప నాయకుడు అన్నారు. అలాంటి నాయకుడు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ రైతు సంక్షేమం కోరి రైతుబంధు రైతు బీమా తో పాటు కెసిఆర్ కిట్ హాస్టల్ పిల్లలకు సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తే వాటిని కొనసాగించలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు ఎత్తేసిందని మర్రి జనార్దన్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలతో ఓట్లు వేసుకొని పథకాలను అమలు చేయలేకపోతున్న ముఖ్యమంత్రి ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రజల మధ్యకు వచ్చి ముక్కు నేలకు రాసి క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల విషయంలో ప్రశ్నించకపోతే ఉన్న పథకాలన్నీ రద్దు చేస్తారని ప్రజలు చైతన్యవంతులై ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను ఎదిరించాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల నోట్లో మట్టి కొడతారా అంటూ పలు పథకాల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రస్థాయిలో ఆయన దుయ్య బట్టారు. కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామన్న ప్రభుత్వం ఉన్నా కన్యాయాన్ని లక్ష్మిని కూడా లేకుండా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు కేసీఆర్ ఇచ్చినలక్ష రూపాయల తో రెండు తులాల బంగారం వచ్చేదని ఇప్పుడు ఆ డబ్బులతో అరతుల బంగారం వచ్చే టట్లు కూడా లేదని ఆయన విమర్శించారు. కళ్యాణ లక్ష్మి చెక్కులను కేసీఆర్ హయంలో నెల రోజుల లోపే వచ్చేదని మొన్నటి వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూడు సంవత్సరాలకు కళ్యాణ లక్ష్మి డబ్బులు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆడపిల్లల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి ఆడపిల్లల శాపంతో తగిన శాస్తి తప్పదని అన్నారు. కెసిఆర్ హయంలో ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ పార్టీ వారికే ఎమ్మెల్యే సంతకం**

సంక్షేమ పథకాలను అందించడంలో నాగర్కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ముఖం చూసి వారు ఏ పార్టీ వారని మరి అడిగి సంతకాలు పెడుతున్నారని మర్రి జనార్దన్ రెడ్డి ఆరోపించారు. పార్టీలు ఎన్నికల సమయంలోనే ఉంటాయని పేదల సంక్షేమ పథకాలు అందించడంలో పార్టీలు చూసి సంతకాలు పెట్టే ఎమ్మెల్యేను మొదటిసారి చూస్తున్నామన్నారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే సర్పంచ్ కు కూడా సరిపోడని మర్రి జనార్దన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇంటికి వచ్చిన ప్రజలకు ఒక కప్పు చాయ్ ఇవ్వడం కూడా తెలియని వారు ప్రజలకు ఏ మేరకు పని చేస్తారో అర్థం చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న పేదలను పార్టీల ను అంటగట్టి తొలగిస్తున్నారని ఆ పేదల ఉసురు తగలక మానదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఒక మహిళ మర్రి జనార్దన్ రెడ్డి ముందు తన గోడును వెళ్ళబోసుకుంది. పేదల పుట్టగొట్టి వారు ఏం బాగుపడతారని మర్రి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సొంత జిల్లా నుంచే పతనం ప్రారంభమైందని ఎందుకు నిదర్శనం వేలాదిగా తరలివచ్చిన ఆడిబిడ్డలే నిదర్శనమని మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. కళ్యాణ లక్ష్మి పథకాన్ని నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ఎండగట్టడానికి మహా ధర్నాకు రావాలని చెప్పిన మరుక్షణమే ఉప్పెనల మహిళలు భారీ సంఖ్యలో తరలి రావడం కాంగ్రెస్ పతనానికి నిదర్శనం అన్నారు. తాను అచ్చంపేటకు వెళ్తానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని నా కుటుంబ సభ్యులు అంతా నాగర్కర్నూల్ లో ఉండగా నేను ఎందుకు పోతానని ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అధికార పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మర్రి జనార్దన్ రెడ్డి ఆరోపించారు.

**పేదలకు బువ్వ పెట్టడం పాపమా**

నాగర్ కర్నూల్ నియోజకవర్గం ప్రజల కు బుక్కడు బువ్వ పెట్టడం కూడా పాపమా అని మర్రి జనార్దన్ రెడ్డి ప్రశ్నించారు. మర్రి అన్న క్యాంటీన్ ద్వారా ప్రతిరోజు ఆకలితో అలమటించే పేదల కోసం బువ్వ పెడుతుంటే మున్సిపాలిటీ ద్వారా నోటీసులు ఇప్పించారని ఇది ఎమ్మెల్యేకు తగదని మర్రి విమర్శించారు. నెలకు 10 నుంచి 15 లక్షలు తన సంపాదనలో ఖర్చు చేస్తుంటే నాకు ఎక్కడ పేరు వస్తుందోనన్న అక్కస్సుతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వారు పెట్టరు నన్ను పెట్టనివ్వరా అంటూ ప్రశ్నించారు. ఆ స్థలానికి నెలకు 5000 రూపాయలు చొప్పున అద్దె కూడా చెల్లిస్తున్నానని మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. ఇంటికి వచ్చిన వారికి చాయ్ ఇచ్చే సంప్రదాయం తెలియని వారు పేద ప్రజల ఆకలిని ఏమి గుర్తిస్తారని ఆయన ఎద్దేవా చేశారు.

**24 గంటల విద్యుత్ కోసం మరో ధర్నా**

24 గంటల విద్యుత్ ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వాన్ని నిలదీయడానికి త్వరలోనే మరో ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. కెసిఆర్ హయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేదని నేడు వ్యవసాయానికి ఇంటి కరెంటుకు కూడా కోతలు పెడుతున్నారని ఆయన విమర్శించారు.

**సీఐ తీరు పై మర్రి ఆగ్రహం**

నాగర్ కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి ధర్నా జరుగుతున్న ప్రాంగణానికి రావడం కార్యకర్తలను పక్కకు జరుపుతూ ఉండడాన్ని గుర్తించిన మర్రి జనార్దన్ రెడ్డి సిఐ తీరును తప్పుపడుతూ మీ ఎమ్మెల్యేను పిలిపించి కళ్యాణ లక్ష్మి డబ్బులు ఇప్పించమని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగా మా ధర్నాను చెడగొట్టాలని సీఐ చూడడం భావ్యం కాదని గద్గద స్వరంతో మర్రి జనార్దన్ రెడ్డి చెప్పడంతో ప్రజలు పెద్ద ఎత్తున పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత కొద్దిసేపు సీఐ అశోక్ రెడ్డి మమర్రి జనార్దన్ రెడ్డి ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. టిఆర్ఎస్ శ్రేణులు ఏ కార్యక్రమం చేసిన అడ్డుకోవడానికి పోలీసులు ముందు వరుసలో ఉంటారని తెలంగాణలో పోలీసులే మంత్రులుగా వ్యవహరిస్తున్నారని వారంతా కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకుంటే మీ దరిదాపులకు కూడా మేము రాబోమని "ఒంటి పైన ఖాకి డ్రెస్సు మనసు అంతా కాంగ్రెస్సు" అన్న చందంగా పోలీసుల వ్యవహారం ఉందని మర్రి జనార్దన్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి తరలి వెళుతున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా మరోసారి తీవ్రస్థాయిలో వావివాదం చోటుచేసుకుంది. అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకోగా కార్యాలయం గేటు మూసి కేవలం ఐదు మంది మాత్రమే వెళ్లాలని సిఐ అశోక్ రెడ్డి చెప్పడంతో మరోమారు తీవ్రస్థాయిలో వాగ్వి వాదం చోటుచేసుకుంది. ఆర్డిఓ కార్యాలయం ముందు అధికారిని పిలిచి మెమోరాండం ఇవ్వడానికి మీకు అభ్యంతరం ఏమిటని మర్రి జనార్దన్ రెడ్డి సిఐ కి చెప్పడంతో పోలీసులు గేటును మూసి రానివ్వకపోవడంతో ఒక్కమారుగా వందలాదిగా తరలివచ్చిన ప్రజలు చొచ్చు కొని ఆర్ డి ఓ కార్యాలయం ప్రాంగణానికి వచ్చారు. అనంతరం కార్యాలయం ముందు బైఠాయించి సంక్షేమ పథకాలను కొనసాగించాలని నినాదాలు చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యల పరిష్కారానికి

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూల స్పందన



గ్రీవెన్స్ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి వినతులు

**హైదరాబాద్, ఆగస్టు 20 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి కమిటీ సభ్యులు బుధవారం గాంధీభవన్‌లోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వికలాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. వికలాంగుల సంక్షేమ శాఖలో కీలకమైన పదవులకు వికలాంగుల సమస్యలపై అవగాహన ఉన్న వారిని నియమించాలని ప్రతినిధులు కోరారు. ముఖ్యంగా వికలాంగుల శాఖ కమిషనర్‌గా వికలాంగుడినే నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరారు. తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో వికలాంగ పురుషులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని ప్రతినిధులు కోరారు. అర్హులైన వికలాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో పాటు, ప్రస్తుతం పింఛన్ పొందుతున్న 4,016 మంది లబ్ధిదారుల పింఛన్‌ను రూ. 6,000కు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వికలాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి, అర్హులైన ప్రతి వికలాంగుడికి ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వికలాంగులకు కేటాయించిన బ్యాక్‌లాగ్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కొంటున్న మరిన్ని సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. వికలాంగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ గుత్తికొండ, హైదరాబాద్ అధ్యక్షుడు పెద్దగొల్ల నాగరాజు, రాష్ట్ర మహిళా నాయకురాలు యశోద గోద తదితరులు పాల్గొన్నారు.

# జెన్-జీ శక్తిని మూడు దశాబ్దాల క్రితమే గుర్తించిన దార్శనికుడు రాజీవ్‌గాంధీ




ఎమ్మెల్యే శ్రీ గణేష్

**కంటోన్మెంట్, ఆగస్టు 20: (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్)** మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ 89వ జయంతి సందర్భంగా బాలంరాయి చౌరస్తాలోని ఆయన విగ్రహానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి రాజీవ్‌గాంధీ అందించిన సేవలను ఎమ్మెల్యే స్మరించుకున్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల క్రితమే యువతలోని శక్తి సామర్థ్యాలను గుర్తించిన దార్శనికుడు రాజీవ్‌గాంధీ అని అన్నారు. దేశంలో సాంకేతిక విప్లవానికి, సమాచార రంగం అభివృద్ధికి పునాదులు వేసి భారతదేశాన్ని ప్రపంచ వేదికపై నిలిపిన మహానాయకుడని కొనియాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవాలనే దూరదృష్టితో ఆయన తీసుకున్న నిర్ణయాలు భారత ప్రగతికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం వంటి కీలక సంస్కరణల ద్వారా యువతకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన నాయకుడు రాజీవ్‌గాంధీ అని శ్రీగణేష్ అన్నారు. యువతను దేశ భవిష్యత్తుగా భావించి వారికి అవకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్‌గాంధీకి నివాళులర్పించారు.

# సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణం కేసీఆర్ హయాంలోనే 60 శాతం పూర్తి: మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని

**సికింద్రాబాద్, ఆగస్టు 20 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన భాషను మార్చుకోవాలని, నోటిని అదుపులో పెట్టుకోవాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి ని అనే విషయాన్ని మరిచిపోయి గౌరవం, సంస్కారం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటు అని విమర్శించారు. కరోనా సమయంలో సరిపడా ఆక్సిజన్, బెడ్ లు లేక ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరాల కోసం ముందు చూపుతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాలలో




కార్పొరేట్ స్థాయి హాస్పిటల్స్ నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 60 శాతం పనులు పూర్తయ్యాయి అనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. సనత్ నగర్ టిమ్స్ ను మేమే కట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకోవడం అవివేకం అని విమర్శించారు. హాస్పిటల్ లో అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించకుండా హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ సభలో అధికారిక కార్యక్రమం అనే సోయి లేకుండా వైద్యులు, నర్సింగ్ విద్యార్థుల ముందు ముఖ్యమంత్రి నోటికొచ్చినట్లు పచ్చి అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం లో కొబ్బరికాయ లు కొట్టి చేతులు దులుపుకున్నారని మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి తగదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ లు చేస్తున్నారని వివరించారు. కానీ ఎదుటి వారి పట్ల గౌరవం, సంస్కారం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలని అన్నారు. తమకు సంస్కారం అడ్డం వస్తుందని, లేదంటే మీకన్నా ఎక్కువ మాట్లాడగలమని చెప్పారు. మహంకాళి జాతరకు వస్తే స్థానిక ఎమ్మెల్యే గా ముఖ్యమంత్రి కి గౌరవ ప్రదంగా స్వాగతం పలికిన విషయాన్ని గుర్తు చేశారు. 6 సార్లు ఎమ్మెల్యే గా, 4 సార్లు మంత్రిగా పని చేసిన తన పట్ల ముఖ్యమంత్రి వాడిన భాష, పదాలు అహంకారానికి నిదర్శనం అని విమర్శించారు. ప్రజాపాలన అని ఒక వైపు ప్రచారం చేసుకుంటూ మరో వైపు నిర్బంధాలు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

**కమిషన్‌ల కోసమే 22 ఏ**

కమిషన్ ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ తీసుకొచ్చిందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం



వ్యక్తం చేశారు. పేద ప్రజల ఇండ్లు, ప్రయివేట్ భూములను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 22 ఏ ను అడ్డం పెట్టుకొని భూముల యజమానులను భయపెట్టి 30 నుండి శాతం కమిషన్ లను వసూలు చేసిన మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం తప్పిదాలు చేసి అధికారులపై నెపం పెట్టి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తుందని విమర్శించారు.

**ఓట్లు పోకుండా చూడాలి**

నియోజకవర్గ పరిధిలో అర్హులైన వారి ఓట్లు పోకుండా చూడాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన డ్రాఫ్ట్ లిస్ట్ ఆధారంగా మీమీ ప్రాంతాలలో ఉన్న వారి ఓట్లు ఉన్నాయా, లేదా పరిశీలన చేయాలని చెప్పారు. ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 16 వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు. జాబితాలో పేర్లు లేనివారు ఉంటే ఓటు నమోదు కోసం వెంటనే ఫారం 6 ను సమర్పించే విధంగా చూడాలని అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బందిని భాగస్వాములను చేయాలని కోరారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, గుర్రం పవన్ కుమార్ గౌడ్, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు గందే నాగులు, టి.శ్రీహరి, కిషోర్, దాడి ప్రవీణ్ రెడ్డి, లక్ష్మీపతి, ప్రేమ్, కొండాపురం మహేష్ యాదవ్, శేఖర్, ఆరీఫ్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, అబ్బాస్, నాగలక్ష్మి, కౌసల్య, సీమ తదితరులు పాల్గొన్నారు.

# తేమను పెంచే ఉపాయాలు

ఫేస్ ప్యాక్‌తో పొడి చర్మానికి తేమను పెంచుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. మార్కెట్లో దొరికే ఫేస్‌ప్యాక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్న పండ్లు, నూనెలు, ఇతర ఉత్పత్తులను ఫేస్‌ప్యాక్‌కు ఉపయోగిస్తే అవే ఫలితాలు ఉంటాయి. చర్మ స్వభావం, సమస్యలను బట్టి ఫేస్ ప్యాక్ దేనితో చేసుకోవాలో నిర్ణయించుకుంటే ఖర్చు తక్కువలో పోతుంది. అందం ఎక్కువగా మెరిసిపోతుంది!అనాటమీ స్టడీ మోడల్స్‌ను ఎంచుకోవడం తేనెని చర్మంపై రాసుకుంటే అది తేమను పెంచి, పై పొరను మృదువుగా మారుస్తుంది. అరటి పండు గుజ్జుని ముఖంపై రాసుకుంటే గరుకుగా ఉండే పొడి చర్మం నునుపుగా మారిపోతుంది. పాలను ముఖానికి రాసుకుని ఆరబెట్టుకుంటే,



అందులోని వెన్న పొడి చర్మాన్ని ఆయిలీగా మారుస్తుంది. అవకాడోలో ఉండే అధిక కొవ్వులు చర్మం కోల్పోయిన సహజ నూనెను తిరిగి భర్తీ చేస్తుంది. కలబంద ఫేస్‌ప్యాక్‌తో పొడిచర్మం వల్ల కలిగే దురద, అసౌకర్యం తగ్గుతాయి. అలాగే చర్మంలో తేమ కూడా పెరుగుతుంది. కొబ్బరి నూనెను పలుచగా ముఖానికి రాసుకుంటే చర్మం తేమను కోల్పోకుండా ఉంటుంది. బాదం నూనెను ముఖానికి రాసుకుంటే చర్మాన్ని మృదువుగా చేస్తుంది. చర్మానికి ఉండే స్థితిస్థాపక గుణాన్ని పెంచుతుంది. అందువల్ల చిన్నచిన్న ముడతలు పోతాయి. పెరుగుని ముఖానికి రాసుకుంటే చర్మాన్ని తేమగా, మృదువుగా మార్చడంతోపాటు టెక్చర్‌ని మెరుగు పరుస్తుంది. రోజ్ వాటర్ పొడిచర్మాన్ని తేమగా మారుస్తుంది. అలాగే అది రాసుకుంటే డ్రై స్కిన్ సమస్య వల్ల కలిగే అసౌకర్యం వెంటనే పోతుంది. దీర్ఘకాలంగా డ్రై స్కిన్ సమస్య ఉంటే ఫేస్ ప్యాక్‌లోకి గ్లిజరిన్‌ని ఉపయోగించాలి. ఇది తేమను పెంచడమే కాకుండా చర్మంపై ఉన్న మృతకణాలను తొలగించి మృదువుగా, కాంతిమంతంగా మారుస్తుంది.

# యువరాజ్ సింగ్ కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ !

టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, ప్రపంచకప్ విజేత యువరాజ్ సింగ్ కోచ్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటికే మెంటార్‌గా ఆటగాళ్లకు దిశానిర్దేశం చేస్తున్న యువరాజ్ సింగ్.. ప్రొఫెషనల్ క్రికెట్‌లో అధికారికంగా ఇప్పటి వరకు కోచ్‌గా వ్యవహరించలేదు.అప్‌కమింగ్ ఐపీఎల్ 2027 సీజన్‌లో యువరాజ్ సింగ్ కోచ్‌గా అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్ బాధ్యతలు చేపట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఇప్పటికే యువరాజ్ సింగ్ నియామక ప్రక్రియ పూర్తయిందని, ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే బాధ్యతలు స్వీకరిస్తాడని ప్రచారం జరుగుతోంది.ఐపీఎల్ 2027 మినీ వేలంలో యువరాజ్ సింగ్ పాల్గొంటాడని తెలుస్తోంది. హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్‌కు కళ్లు చెదిరే పారితోషకం ఇచ్చేందుకు ఢిల్లీ యాజమాన్యం సిద్ధమైందని సమాచారం. రూ. 9.5 కోట్ల భారీ వేతనంతో యువరాజ్ సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే ఓ కోచ్ అందుకున్న అత్యధిక పారితోషకం ఇదే కావడం విశేషం. ఇప్పటి వరకు రికీ పాంటింగ్ పేరిట ఈ రికార్డ్ ఉంది. పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా రికీ పాంటింగ్ రూ.9 కోట్ల వేతనం అందుకుంటున్నట్లు సమాచారం. అతని తర్వాత స్టీఫెన్ ఫ్లేమింగ్ రూ.7.5 కోట్లు, లక్నో సూపర్ జెయింట్స్ డైరెక్టర్‌గా జహీర్ ఖాన్ రూ. 5 కోట్లు, రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ రూ.4.5 కోట్లు, ఆండీ ఫ్లవర్, జస్టిన్ లాంగర్ రూ.4 కోట్ల చొప్పున వేతనం తీసుకున్నట్లు సమాచారం. ఐపీఎల్ చరిత్రలోనే ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటి వరకు టైటిల్ గెలవలేదు. యువరాజ్ సింగ్ పర్యవేక్షణలోనైనా ఆ ముచ్చట తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఆ జట్టు ఉంది. రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరే అవకాశాలు ఉన్నాయి. లక్నో సూపర్ జెయింట్స్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న రిషభ్ పంత్.. తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ సారథ్య బాధ్యతలు చేపడుతాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ ఆరంభంలో మెరుగైన ప్రదర్శన చేసినా.. కీలక సమయంలో చేతులెత్తేసింది. 14 మ్యాచ్‌ల్లో 7 మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానంలో నిలిచింది.



# బీసీసీఐపై మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం



భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)పై మాజీ క్రికెటర్, 1983 ప్రపంచకప్ విన్నర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్‌పై ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు వస్తున్నాయని, అతనిపై చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించాడు.జూనియర్ లెవెల్ క్రికెట్ సెలెక్షన్‌లో ఎంపికయ్యేందుకు మిథున్ మన్హాస్ ఏజ్ ఫ్రాడ్‌కు పాల్పడినట్లు జమ్మూ కశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ మాజీ జాయింట్ సెక్రటరీ సుదర్శన్ మెహతా ఆరోపించారు. మాజీ డీఎస్పీ అయిన సుదర్శన్ మెహతా.. మిథున్ మన్హాస్‌పై చర్యలు తీసుకోవాలని కోర్టును కూడా ఆశ్రయించారు. సబ్-జూనియర్, జూనియర్ విభాగాల్లోని నేషనల్ టోర్నీల ఎంపికకు అర్హత సాధించేందుకు మన్హాస్ రెండు వేర్వేరు పట్టిన తేదీలను సమర్పించారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపి సెప్టెంబర్ 3లోపు నివేదిక సమర్పించాలని జమ్మూలోని స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ న్యూస్ క్లిప్‌ను ఎక్స్ వేదికగా షేర్ చేసిన కీర్తి ఆజాద్.. బీసీసీఐ ఏం చేస్తుందని విమర్శలు గుప్పించాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఏం చేస్తోంది? ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. మిథున్ మన్హాస్‌కు రెండు వేర్వేరు జన్మదిన తేదీలు ఉన్నాయి . ఒకటి బీసీసీఐలో నమోదైతే.. మరొకటి డీడీసీఏలో నమోదైంది. బీసీసీఐ తన సొంత అధ్యక్షుడిపై చర్యలు తీసుకుంటుందా?'అని అని కీర్తి ఆజాద్ ప్రశ్నించారు. కీర్తి ఆజాద్ పోస్ట్‌తో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. మాజీ దేశవాళీ క్రికెటర్ అయిన మిథున్ మన్హాస్ జమ్మూకశ్మీర్‌కు చెందినవాడు. జమ్మూకశ్వీర్ తరఫున కెరీర్ ప్రారంభించిన అతను ఆ తర్వాత న్యూఢిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. దేశవాళీ క్రికెట్‌లో రాణించినా.. టీమిండియా తరఫున ఆడే అవకాశం అతనికి రాలేదు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించాడు. ఏజ్ క్రికెట్ కోసం తన బర్త్ డే డేట్‌ను 9/12/1977 పేర్కొన్న మిథున్ మన్హాస్.. ఢిల్లీకి ఆడే సమయంలో 12/10/1979గా పేర్కొన్నాడని ఆరోపణలు వస్తున్నాయి. క్రికెట్‌లో ఏజ్ ఫ్రాడ్‌ను తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఈ ఆరోపణలపై మిథున్ మన్హాస్ కానీ, బీసీసీఐ కానీ ఇప్పటి వరకు స్పందించలేదు.

# సచిన్‌తో పోల్చితే కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడు

• సౌతాఫ్రికా

## క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్

భారత క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలో ఎవరు అత్యుత్తమం అనే చర్చ తరుచూ జరుగుతూనే ఉంటుంది. భారత క్రికెట్ ఐకాన్స్ అయిన ఈ ఇద్దరి మధ్య పోలిక అనవసరమని చాలా మంది మాజీ క్రికెటర్లు సమాధానం చెప్పేందుకు తప్పించుకున్నారు. ఇద్దరి క్రికెటర్ల తరాలు భిన్నమైనవని, ఇద్దర్ని పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. కానీ తాజాగా సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్‌ను ఇదే ప్రశ్న అడగ్గా.. నిర్మోహమాటంగా సమాధానం చెప్పాడు. సచిన్‌తో పోల్చితే విరాట్ కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టెస్ట్‌ల్లో విదేశీ గడ్డపై విరాట్ కోహ్లీ రాణించినట్లుగా సచిన్ ఆడలేకపోయాడని తెలిపాడు. విరాట్ కోహ్లీ విదేశీ గడ్డపై భారత బ్యాటింగ్ స్థాయిని పెంచారని, తన సమకాలీన ఆటగాళ్లు కూడా అక్కడి పరిస్థితుల్లో మెరుగ్గా రాణించేలా ప్రేరేపించారని ఏబీడీ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు. 'విదేశాల్లో సచిన్ టెండూల్కర్ ఒక ప్రమాణాన్ని నెలకొల్పాడు. కానీ కోహ్లీ ఆ ప్రదర్శనలను మరో స్థాయికి తీసుకెళ్లాడు. టెస్ట్ క్రికెట్‌లో 15,921 పరుగులు, 51 సెంచరీలతో సచిన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 176 ఇన్నింగ్స్‌ల్లో విదేశీ గడ్డపై 51 సగటుతో పరుగులు చేశాడు. మరోవైపు విరాట్ కోహ్లీ 123 టెస్ట్‌ల్లో 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. విదేశాల్లో కోహ్లీ సగటు 68 మ్యాచ్‌ల్లో 41గా ఉంది. భారత్ కోసం సచిన్ కొత్త ఒరవడిని ప్రారంభించినా.. విరాట్ కోహ్లీ అంతటి స్థాయి అప్పట్లో సచిన్‌కు లేదు.

విదేశాల్లో బౌన్సీ, సీమింగ్ పిచ్‌లపై కూడా రాణించవచ్చని నిరూపించిన మొదటి వ్యక్తి సచిన్'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ అడుగుజాడల్లో దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్ కొనసాగుతున్నారని డివిలియర్స్ పేర్కొన్నాడు. 'కేఎల్ రాహుల్‌కు మంచి టెక్నిక్ ఉంది. అతను భారత జట్టుకు ఒక పెద్ద ఆస్తి.

కానీ విదేశాల్లో అతని సగటు కేవలం 34 మాత్రమే. ఈ విషయంలో అతను ఇంకా మెరుగవ్వాలి. క్రీజులో సెట్ అయిన తర్వాత భారీ స్కోర్లు చేయాలి. కేవలం సెంచరీలే కాకుండా డబుల్ సెంచరీలు చేయాలి. ఎందుకంటే కొత్త బంతికి ఔటవ్వడం ఎప్పుడైనా జరగవచ్చు. కాబట్టి మెరుగైన ఆరంభాన్ని భారీ స్కోర్లుగా మల్చాలి'అని డివిలియర్స్ సూచించాడు.





# శ్రీలంకతో రెండో టెస్ట్‌కు కుల్దీప్‌పై వేటు!!

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా ఆఖరి పోరుకు సన్నదమవుతోంది. ఆదివారం నుంచి కొలంబో వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్ట్ తరహాలోనే కొలంబోలోనూ ఆధిపత్యం చెలాయించి 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో భారత్ ఉంది. తద్వారా డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకుంటుంది.తొలి టెస్ట్‌లో భారత్ మూడు విభాగాల్లో సత్తా చాటింది. అయితే కుల్దీప్ యాదవ్ వైఫల్యం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో (1/65) ఒకే ఒక్క వికెట్ తీసిన కుల్దీప్ యాదవ్.. రెండో ఇన్నింగ్స్‌లో (0/37) ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. మరోవైపు మానవ్ సుతర్ 10 వికెట్లతో సత్తా చాటగా.. జడేజా నాలుగు వికెట్లు పడగొట్టాడు. దాంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వస్తున్నాయి.అయితే కుల్దీప్ యాదవ్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అనగా.. అతి తక్కువ ఓవర్లు బౌలింగ్ చేసి ఎక్కువ పరుగులిచ్చాడని ఆకాశ్ చోప్రా తెలిపాడు. ఈ క్రమంలోనే రెండో టెస్ట్ నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అతని స్థానంలో డొమెస్టిక్ వెటరన్ స్పిన్నర్ సరాన్ష్ జైన్‌ను ఆడిస్తారనే చర్చ జరుగుతోంది. అదే జరిగితే 33 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన భారత క్రికెటర్‌గా సరాన్ష్ జైన్ నిలవనున్నాడు.మరోవైపు భారత్ మూడో స్పిన్నర్‌తో ఆడాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌ను కొనసాగించాలని అశ్విన్ సూచించాడు. ఆకాశ్ చోప్రా మాత్రం కుల్దీప్ యాదవ్ స్థానంలో సరాన్ష్ జైన్‌ను ఆడించవచ్చని అంచనా వేసాడు. మరి టీమ్‌మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. తొలి టెస్ట్‌లో ధ్రువ్ జురెల్ గాయపడ్డాడు. మూడో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తుండగా.. అతని ఎడమ చీలమండకు గాయమైంది. దాంతో అతను మైదానం వీడగా.. సర్ఫరాజ్ ఖాన్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా మ్యాచ్‌లో కొనసాగాడు. ప్రస్తుతం అతని గాయాన్ని బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తుందని తెలుస్తోంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే రెండో టెస్ట్‌కు ధ్రువ్ జురెల్ దూరం కానున్నాడు. అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. తొలి టెస్ట్‌లో జురెల్ హాఫ్ సెంచరీతో రాణించాడు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, జైస్వాల్ ఆడనుండగా.. దేవదత్ పడిక్కల్ ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగనున్నాడు. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా మిడిలార్డర్‌లో ఆడనున్నారు. తొలి టెస్ట్‌లో విఫలమైన జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సత్తా చాటాల్సిన అవసరం ఉంది. మానవ్ సుతార్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఆడనుండగా.. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలో ఒకరికి రెస్ట్ ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు. ఆకీబ్ నబీకి మరోసారి నిరాశే ఎదురవ్వనుంది. శ్రీలంకతో రెండో టెస్ట్‌కు భారత్ తుది జట్టు(అంచనా) యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్/ సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, సరాన్ష్ జైన్/కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ/గుర్నూర్ బ్రార్.

# క్వార్టర్‌ఫైనల్‌కు గాయత్రి-త్రీసా

**సాత్విక్-చిరాగ్ శెట్టి జోడీ కూడా..**

**ప్రీ క్వార్టర్స్‌లో ఓడిన సింధు, ఆయుశ్**

**బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్**



**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ సింగిల్స్‌లో పివి సింధు, ఆయుశ్ శెట్టి పోరాటం ప్రీ క్వార్టర్ ఫైనల్లో ముగియగా.. మహిళల, పురుషుల డబుల్స్‌లో భారత షట్లర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరి పతకానికి అడుగు దూరంలో నిలిచారు. ఈ జోడీలు సెమీస్‌కు చేరితే కనీసం కాంస్య పతకం ఖాయం కానుంది. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో గురువారం ఉత్కంఠభరితంగా సాగిన మహిళల సింగిల్స్‌లో సింధు 11-21, 21-15, 17-21తో 3వ సీడ్, చైనా షట్లర్ వాంగ్ చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి ఇండోనేషియాకు చెందిన 11వ సీడ్ అల్వీ ఫర్హాన్ చేతిలో 19-21, 11-21తో వరుస గేముల్లో ఓటమిపాలయ్యాడు. దీంతో తొలిరౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్ షి యూకీని ఓడించి సంచలనం సృష్టించిన ఆయుష్.. ప్రీ-క్వార్టర్ ఫైనల్‌లోనే తన ప్రయాణాన్ని ముగించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల-తానీసా కాస్ట్రో పోరాటం ముగిసింది. ప్రీ క్వార్టర్స్‌లో వీరు 16-21, 5-21తో 6వ సీడ్, చైనా షట్లర్ల చేతిలో చిత్తుగా ఓడారు.

### క్వార్టర్స్‌కు గాయత్రి, త్రీసా జోడీ...

మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్-త్రీసా జోలీ జంట సంచలనం నమోదు చేసింది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్లో ఏకంగా ఏడో సీడ్‌ను జంటను చిత్తుచేశారు. హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌లో గాయత్రి-త్రీసా జంట 21-16, 21-12తో జపాన్‌కు చెందిన కీ నకనిశి జంటకు షాక్ ఇచ్చారు. తొలి సెట్‌ను 21-16తో నెగ్గిన భారత అమ్మాయిలు.. రెండో సెట్‌నూ 21-12తో సెట్‌ను గెలిచి పతకానికి అడుగు దూరంలో నిలిచారు. ఆ తర్వాతి రౌండ్‌లో గాయత్రి-త్రీసా జంటకు నాలుగో సీడ్ జియా యి ఫాన్ -- ఝాంగ్ షు గ్జియాన్(చైనా)తో గట్టి పోటీ ఎదురుకానుంది.ఇక పురుషుల డబుల్స్‌లో 5వ సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట మూడుసెట్ల హోరాహోరీ పోరులో మలేషియా జంటను చిత్తుచేశారు. ఉత్కంఠభరితంగా సాగిన ప్రీ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ 21-23, 21-19, 21-19తో మలేషియాకు చెందిన ఆరిఫ్-యాప్‌లను చిత్తుచేశారు.

శుక్రవారం , ఆగస్టు 21 , 2026
భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# మ్యూజికల్ డ్రామా..జగమే సంగీతం

## అమెజాన్‌లో 4నుంచి వెబ్ సీరిస్

టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది.ఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని కొనసాగించాలనుకునే బాలు అనే యువకుడు.. కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం. తన కుటుంబం నిర్మించిన ప్రతిష్టను కాపాడుకుంటూనే, తనకంటూ ప్రత్యేకమైన కళాత్మక స్వరాన్ని ఎలా కనుగొన్నాడనే భావోద్వేగ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే హృద్యమైన కథే 'జగమే సంగీతం' అని, సంప్రదాయం, ఆశయం వంటి అంశాలను ఇది అద్భుతంగా అన్వేషిస్తుందని తెలిపారు. అలాగే నిర్మాత సుష్మిత కొణిదెల మాట్లాడుతూ.. సంగీతం కేవలం ఒక కళ మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రేమ, సంఘర్షణలను తెలిపే భావోద్వేగ భాషగా ఎలా మారుతుందో ఈ సిరీస్ ద్వారా చూపిస్తున్నామని పేర్కొన్నారు. అసాధారణ నటీనటులతో తెరకెక్కిన ఈ సంగీత భరిత ప్రయాణాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.




# 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించకూడదనే తన సిద్ధాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన్'తో పోల్చిన ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.




# తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

### ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫోటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.

----------------

# రామ్ చరణ్ అన్నతో సినిమా చేయాలని ఉంది : వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన సోదరుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి వెండితెరను పంచుకోవాలన్న తన ఆకాంక్షను వెల్లడించారు. ఇటీవల 'కొరియన్ కనకరాజు' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆయన, ఆ సంతోషాన్ని పంచుకుంటూ తన కెరీర్, భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.గత ఐదేళ్లుగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో కొంత ఒత్తిడికి లోనయ్యానని, అయితే 'కొరియన్ కనకరాజు' చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన ఆదరణతో ఇప్పుడు ఎంతో ఊరటగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. కేవలం ఒకే తరహా జోనర్‌లకు పరిమితం కావడం తనకు ఇష్టం ఉండదని, నటుడన్నవాడు ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయాలని తాను నమ్ముతానని చెప్పారు. కరోనా అనంతర కాలంలో ఓటీటీ ప్రాధాన్యత పెరిగినప్పటికీ, థియేటర్‌లకు వచ్చే ప్రేక్షకులకు ఒత్తిడిని దూరం చేసేలా స్వచ్ఛమైన వినోదాన్ని అందించడం ఎంతో కీలకమని తాను గ్రహించినట్లు వివరించారు.త్వరలో విడుదల కానున్న స్పోర్ట్స్ డ్రామా 'బరి' గురించి ప్రస్తావిస్తూ, గతంలో తాను చేసిన 'గని' చిత్రంలో అనేక అంశాలను జోడించడం వల్ల కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే 'బరి' మాత్రం పూర్తి క్రీడా నేపథ్యంతో ఎంతో వాస్తవికంగా ఉంటుందని వరుణ్ తేజ్ భరోసా ఇచ్చారు. ఈ చిత్ర ఆలోచన తన సోదరి నిహారిక నుంచి వచ్చిందని తెలిపారు. దీనితో పాటు, ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఒక రొమాంటిక్ చిత్రానికి అంగీకరించానని, తన వయసుకు తగినట్లుగా ఉండే ఈ ప్రేమకథ విభిన్న శైలిలో ఉంటుందని వెల్లడించారు.రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ, "చరణ్ అన్నయ్య అగ్ర కథానాయకుడు. తన సినిమాల కోసం ఆయన పడే శ్రమను చూసి నేను ఎంతో స్ఫూర్తి పొందుతుంటాను. చరణ్ అన్నతో కలిసి ఒక సినిమా చేయాలన్నది నా కోరిక" అని తన మనసులోని మాటను బయటపెట్టారు. తాను చిత్ర పరిశ్రమలోకి దర్శకుడు కావాలనే లక్ష్యంతో అడుగుపెట్టానని, భవిష్యత్తులో ఆ దిశగా తప్పకుండా అడుగులు వేస్తానని వరుణ్ తేజ్ స్పష్టం చేశారు.



# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ కొత్త సినిమా టైటిల్ ఇదే..

విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సినిమాకు టైటిల్ ఖరారైంది. ఇంతవరకు #VenkyAnil5, #NKRAR2 పేర్లతో ప్రచారంలో ఉన్న ఈ చిత్రానికి 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. షైన్ స్క్రీన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను ప్రత్యేక వీడియో ద్వారా ప్రకటించారు. ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు నివాళిగా 'అప్పుల అప్పారావు'లోని ఓ హాస్య సన్నివేశాన్ని గుర్తు చేస్తూ వీడియోను మొదలుపెట్టారు. ఈవీవీ సత్యనారాయణ తనకు స్ఫూర్తి అని అనిల్ రావిపూడి పలు సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే.వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతిశెట్టి కలిసి అనిల్ రావిపూడిని సినిమా టైటిల్ ఏంటని అడుగుతారు. అందుకు ఆయన ఎలాంటి తడబాటు లేకుండా 'జనవరి 12 విడుదల' అని చెబుతారు. దీంతో నటీనటులు కాసేపు అయోమయానికి గురవుతారు.

తాము విడుదల తేదీ గురించి కాదు.. టైటిల్ గురించి అడిగామని చెబుతారు. చివరికి అదే సినిమా టైటిల్ అని అనిల్ వెల్లడించడంతో వీడియో ముగుస్తుంది.కొద్ది రోజుల క్రితం వెంకటేశ్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. సినీ పరిశ్రమలో ఆయన 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ పోస్టర్‌ను తీసుకొచ్చారు. ఇందులో లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్‌రెడ్డిగా వెంకటేశ్ కనిపించారు.భారత సైన్యంలో పనిచేసే ఈ అధికారి కౌంటర్ టెర్రరిజం, బందీలను రక్షించే కార్యకలాపాల్లో నిపుణుడిగా ఉంటారని పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఆర్మీ దుస్తుల్లో, సన్‌గ్లాసెస్‌తో, ఓ కారు పక్కన వెంకటేశ్ కనిపించిన తీరు ఆకట్టుకుంది.వెంకటేశ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్‌కు కృతిశెట్టి జంటగా కనిపించనున్నారు. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌తో పాటు అనిల్ రావిపూడి మార్క్ వినోదం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.సాహు గారపాటి షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. సమీర్‌రెడ్డి కెమెరామెన్, తమ్మిరాజు ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు.




# రంభ ఊర్వశి మేనక నుంచి మరో పాట విడుదల




'రంభ ఊర్వశి మేనక' అంటూ అల్లరి చేయడానికి సిద్ధమయ్యారు అల్లరి నరేశ్. ఆయన ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులోని రెండో పాటను విడుదల చేశారు. 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటలో వెళ్లవే పేదరికం.. ఇక్కడే
ఇల్లరికం అనే లిరిక్స్ నేపథ్యానికి తగినట్లుగా ఉన్నాయి. చంద్రమోహన్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నరేశ్‌కు జోడీగా సురభి నటించారు.

# మమితా బైజు .. మరో మూవీతో సిద్ధం



'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888